# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 1 పరాభవ - భాద్రపద శుద్ధ విదియ, 13 సెప్టెంబరు 2026

## శతావధాని పళ్ళెపూర్ణ ప్రజ్ఞాచార్యులు

(1897-1977)

ఉ. ఏక శతంబు వ్యాఘ్రముల నిర్వదియొక్క గజంబులన్ ద్రుటిన్
వే కబళించితిన్ వ్రతము వీడన మ్రింగమి నొక్క సింగమున్
బోకుమటంచుఁ బై దుముకుపోఁ యను గడ్డము మీసమున్న యా
మేకను జూచి సింగమది మ్రింగునొ! యంచుఁటికెన్ భయంబునన్



ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్




పండరి రాధాకృష్ణ, భక్తిసాధనం నిర్వహణలో ధర్మష్ఠ, మియాపూర్‌లో జరిగిన
అష్టకాల విద్యా చరణ్ గారి అష్టావధానం




పండరి రాధాకృష్ణ, భక్తిసాధనం నిర్వహణలో ధర్మష్ఠ, మియాపూర్‌లో జరిగిన
అయితగోని వేంకటేశ్వర్లు గారి ఏకదివస శతావధానం

# అవధాన పుష్కరిణి

సంపుటి - 2 అంతర్జాల మాస పత్రిక సంచిక - 1

పరాభవ - భాద్రపదం 2026 13-09-2026 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్ R.No.691/2026


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

– డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య
కుంతి

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
డా॥ మారేపల్లి వేంకట పట్వర్ధన్
డా॥ ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికింద్రాబాద్ - 500 056
ఫోన్: 9441039146



అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు సహృదయులు ఆర్థికంగా సహకరించగలరు.
బ్యాంకు వివరాలు
**Avadhana Vidya Vikasa Parishat**
Ac. no. 60589741600;Bank of Maharashtra
Malkajgiri branch; MAHB0000955


అవధానవిద్యా విజయతే తరామ్

## సంపాదకీయం

# నేటి తరానికి అవధానం అవసరమా?

సాంకేతిక యుగంలో మానవ మేధకు అవధానం ఒక మేలుకొలుపు.

నేటి తరానికి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంది. క్షణంలో సమాచారం అందుబాటులోకి వస్తోంది. కృత్రిమ మేధతో ప్రపంచంలోని ఏ విషయం గురించైనా క్షణాల్లో తెలుసుకోవడానికి అనేక మార్గాలున్నాయి. ఐనా ఒక ప్రశ్న –

సమాచారం పెరిగే కొద్దీ మనిషి ఏకాగ్రత పెరుగుతోందా? జ్ఞానం పెరుగుతున్న కొద్దీ ధారణ పెరుగుతోందా? సమాధానం ..'లేదనే' కదా!

ఒకేసారి అనేక సందేశాలు, వీడియోలు, నోటిఫికేషన్లు, వార్తలు మన దృష్టిని ఆకర్షిస్తూ ఏకాగ్రతను దెబ్బ తీస్తుంటాయి. కానీ అవధానం దీనికి భిన్నమైనదిగా ఒక విషయాన్ని శ్రద్ధగా వినడం, దానిని మనస్సులో నిలుపుకోవడం, అవసరమైనప్పుడు తిరిగి గుర్తుకు తెచ్చుకోవడం నేర్పుతుంది. ఇది విద్యార్థికి మాత్రమే కాదు – ప్రతి మనిషికీ అవసరమైన మానసిక క్రమశిక్షణ అలవరుస్తుంది.

సాంకేతిక పరికరాలొచ్చాక ఫోన్ నంబర్లు, తేదీలు, చిరునామాలు, సమాచారాన్ని గుర్తుంచుకునే అలవాటు పోయింది. **"మెదడు మాత్రమే సాధన చేయవలసిన ఒక మహత్తర సాధనం"** అని అవధానం నేర్పుతుంది. ధారణాభ్యాసం ద్వారా జ్ఞాపకశక్తిని క్రమబద్ధంగా వినియోగించడం నేర్చుకోవచ్చు.

కృత్రిమమేధాయుగంలో మానవసృజనాత్మకత అత్యంత ముఖ్యమైన విషయం. యంత్రం సమాధానం ఇవ్వగలదు; కానీ సందర్భాన్ని అనుభూతి చెంది, సభ్యుల స్పందనను గ్రహించి, రసావిష్కృత భావాన్ని సృజించలేదు.

భాష కేవలం సంభాషణా సాధనమే కాదు; అది ఒక జాతి సంస్కృతి. తెలుగు పదసంపద, ఛందస్సు, అలంకారాలు, సామెతలు, పురాణ–ఇతిహాస పరిజ్ఞానం, సాహిత్యసంప్రదాయం–ఇవన్నీ అవధానంలో సహజంగా ఉపయోగించబడతాయి. కాబట్టి యువతకు అవధానం నేర్పడం అంటే కేవలం పద్యాలు నేర్పడం కాదు; తెలుగు భాషతో సజీవమైన సహజసంబంధాన్ని ఏర్పరచడం.

వేలాది మంది ముందు నిలబడి, ముందుగా తెలియని ప్రశ్నకు సమాధానం ఇవ్వడం చిన్న విషయం కాదు. అవధానవిద్య వల్ల సభాకంపనం తగ్గుతుంది. మాట్లాడే సామర్థ్యం పెరుగుతుంది. ఆలోచనలో స్పష్టత వస్తుంది. సమయస్ఫూర్తి పెరుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఇవి విద్యార్థి జీవితంలో మాత్రమే కాదు, భవిష్యత్తులో వృత్తి జీవితంలో కూడా ఉపయోగపడే నైపుణ్యాలు.

(మిగతా 2వ పేజీలో)

# సంస్తుతి

 మ. కరుణాసాగరవీచికల్ మను సుమగ్రామప్రసూవాటికల్
చిరవిద్యామయకీలికల్ భవగదచ్ఛేదక్షమల్ మూలికల్
స్మరలీలాగృహకేళికల్ త్వదమలేక్షాకోణదృఙ్మాలికల్
సిరిసింగారపు డోలికల్ గొలిచెదన్ శృంగాచలాధీశ్వరీ!

సీ. సర్వత్ర కలపంచుఁ జాటి చాటక మున్నె
త్రిజగంబు నిండుట రిత్త యగును
పదియేండ్లు లేనట్టి పసిబాలు రక్షింప
నుగ్రరూపము దాల్చుటుట్టిదగును
ఘోరాగ్నులన్ జగద్గురుమూర్తి రగులంగ
వానిఁ బ్రోచిన మాట వట్టిదగును
కాపాలికుండు శంకరశీర్షమునుఁ గోర
వాని వ్రచ్చిన మాట వ్యర్థమగును

తే.గీ. ఇపుడు నాముందు రూపొంది యేలకుంటి
వేని పాతపురాణంబు లేలనయ్య
తీక్ష్ణనఖరాగ్రనిక్షుణ్ణదితిజరంహ
చేరరా పరబ్రహ్మ లక్ష్మీనృసింహ!

– శతావధాని **గన్నవరం లలితాదిత్య**
(భాగ్యనగరం శతావధానంలో)

(1వ పేజీ తరువాయి) **సంపాదకీయం**

తెలివిని ఎలా ఉపయోగించాలో కూడా నేర్పేవిద్య ఇది. అవధానం రసవిద్య, సరసవిద్య.

పృచ్ఛకుని గౌరవించడం, సభామర్యాద పాటించడం, ఇతరుల మాట వినడం, విమర్శను స్వీకరించడం, విజయంలో వినయంగా ఉండటం – ఇవి అవధాన వేదికలో నేర్చుకునే సంస్కారాలు. ప్రతి విద్యార్థిని అవధానిగా తయారు చేయాలనే లక్ష్యం కన్నా అవధానంలోని శిక్షణ పద్ధతులను విద్యలో ఉపయోగించడం ముఖ్యం.

శ్రద్ధగా వినడం, పదాలను గుర్తుంచుకోవడం, చిన్న ధారణాభ్యాసాలు మొదటి మెట్టు. దత్తపదాలు, పదసృజన, సమస్యాపూరణ పరిచయం, చిత్రవర్ణన రెండవ మెట్టు. ఛందస్సు, ఆశుకవిత్వం, బహుళ ధారణ, పృచ్ఛక సంభాషణ ఆసక్తి ఉన్న విద్యార్థులకు మూడవ మెట్టు.

అవధాన శిక్షణా శిబిరాలు, అవధాన సభల పరిశీలన, గురుముఖతః అభ్యాసం వంటివన్నీ అవధానం ద్వారా భయపెట్టే కఠిన విద్యలుగా కాకుండా, ఆటగా అభ్యాస సృజనాత్మకతల సమ్మేళనంగా పరిచయం చేయాలి.

అవధానం గత వైభవం మాత్రమే కాదు. దాని మూలాలు ప్రాచీనమైనప్పటికీ, దాని ప్రయోజనాలు ఆధునికమైనవి.

ఏకాగ్రత ఆధునిక అవసరం.
జ్ఞాపకశక్తి ఆధునిక అవసరం.
సృజనాత్మకత ఆధునిక అవసరం.
సమయస్ఫూర్తి ఆధునిక అవసరం.
భాషా నైపుణ్యం ఆధునిక అవసరం.
సంభాషణా సామర్థ్యం ఆధునిక అవసరం.

ఈ అవసరాలన్నింటినీ ఒకే వేదికపై అభ్యసించే అవకాశం అవధానం కల్పిస్తుంది. **నిన్నటి వారసత్వమైన అవధానం నేటి మేధావికాసానికి సాధనగామారితే రేపటి తరానికి జ్ఞాన సంపద అయితీరుతుంది**

## ఇదీ క్రమణిక


1. సత్కవిప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం .. 3
2. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... .... . 4
3. పిసుపాటి చిదంబరశాస్త్రి 1914 అవధానం ... 5
4. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 6
5. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 7
6. అంశావలోకనము ... ... ... ... ... ... ... 8
7. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 10
8. యతిప్రాస వివేచనము -2... ... ... ... ... 12
9. ప్రహేళికా ... ... ... ... ... ... ... ... ... 13
10. పూరణతోరణం ... ... ... ... ... ... ... .. 14
11. పద్యపరీమళం ... ... ... ... ... ... 15,24
12. నిఘంటుపరిజ్ఞానం ... ... ... ... ... ... .. 16
13. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
14. సంస్కృతం సంస్కృతి ... ... ... ... ... .. 20
15. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 21


## సహృద్వాణి

Wonderful compilation on Avadhanams. Book is worth preserving for hundred years. Thank you Sarma garu.

***-Dr. ChilukapatiVijaya Raghavacharyulu***




# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని **డా॥ జి.యం. రామశర్మ**

**మ.** జగతీనాథులు పెక్కుమంది ముదితస్వాంతంబులం గాన్కలం
పగ సాంగంబు సలక్షణంబుగ శరద్ద్వావింశతిం బేర్మి హె
చ్చగ మే మేలిన యీ వధానకవితా సామ్రాజ్యభారంబు మో
యగ బూనంగదవయ్య! తండ్రి శివరామయ్యా! చిరంజీవివై.

1911 సంవత్సరంలో గుంటూరు కళాశాలలో విజయవంతంగా శతావధానం నిర్వహించిన తన శిష్యమణియైన శ్రీ వేలూరి శివరామశాస్త్రిని సహర్షంగా దీవిస్తూ శతావధాని శ్రీ దివాకర్ల తిరుపతిశాస్త్రి గారు చెప్పిన పద్యమది. తామంతవరకు యేలిన అవధాన సామ్రాజ్యాన్ని శ్రీ తిరుపతిశాస్త్రిగారు తన శిష్యున కప్పగించడమనే అంశం పై పద్యంలోని విశేషం.

కృష్ణాజిల్లా చిరివాడ గ్రామంలో జన్మించిన శ్రీ వేలూరి శివరామ శాస్త్రి గారు (1892-1967) సంస్కృతాంధ్రాలలో అనేక అష్ట శతావధానాలు చేసి గొప్పపేరు సంపాదించుకున్నారు. శ్రీ వేలూరి వారు శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారితో కలిసి కూడ 1924 సం॥లో ఒక శతావధానాన్ని నిర్వహించారు. శ్రీ శివరామశాస్త్రి గారికి ఒక అవధానంలో ***'దాని కుమారులున్ మువురు దాని రమించిరదేమి చిత్రమో'*** అను సమస్యనీయగా వారు సమర్థంగా ఇలా పూరించారు.

**ఉ.** దాని కుమారులున్ మువురు దాని రమించిరదేమి చిత్రమో
యౌననుచున్ సమస్యనిడ నయ్యెడ నొక్క కవీశ్వరుండు, తొ
ల్దానికి కుంతియుం బిదప దానికి ద్రౌపది యంచు నర్థమున్
దానొనరించి పూరణ మొనర్చెను తన్నిమిషంబునందునన్

సమస్యలోని అసంగతత్వమేమిటో అందరికి తెలిసిందే. ఈ పూరణలోని విశేషం – సమస్యా పాదాన్ని పద్యంలోని మొదటి పాదంగా మలచుకోవడం.

పై సమస్యను ఒక కవీశ్వరునకీయగా ఆ కవి సమస్యలోని మొదట దానికి 'కుంతి'యని రెండవదానికి ద్రౌపది యని చమత్కార వంతంగా అర్థాన్ని కల్పించి సద్యః స్ఫురణతో పూరించారట. కుంతి కుమారులగు ధర్మజ భీమార్జునులు ముగ్గురు ద్రౌపదిని రమించారనేది అందులోని భావం.

శ్రీ వేలూరివారికే మరో అవధానంలో ***'పంది పటుక్కునం గౌరికె పంకజలోచన మోవి గ్రక్కునన్'*** అనే సమస్య నీయగా వారు రమణీయంగా ఇలా పూరించారు.

**ఉ.** చెందొవ బోలు నెమ్మొగము, చెల్వగు తత్కరపల్లవమ్ము చొ
క్కందన మొప్పు కన్నులు వికాసిత నొప్పెడు మేను దీవయున్
సుందరమైన రూపు, గడుసుందనమున్ గని మోహవార్ధిని
ష్పంది పటుక్కునం గౌరికె పంకజలోచన మోవి గ్రక్కునన్

సమస్యలోని అనౌచిత్యం సాహితీ ప్రియులకు విదితమే. సమస్య లోని 'పంది'– పూరణలో మోహవార్థి'నిష్పంది'గా మారింది. పద్యంలోని మొదట మూడు పాదాలలో రమణి రమణీయ రూపాన్ని రమ్యంగా వర్ణించారు అవధాని. అంతటి సౌందర్యరాశిని ఒకానొక రసికుడు మోహసాగరంలో పరవశుడై కదలాడుతూ ఆ కమలాక్షి మోమును కఱకుగా కొఱికాడట. ఇది రసిక జన రంజన పూరణ.

వేలూరివారి మరికొన్ని పూరణలు:

గిరివరుఁడగు హిమవంతు కొ
మిరె యీశ్వరు సామిమేని మేకొను శక్తి
స్ఫురణం బెలువారెడు నా
సరసీరుహ నేత్ర కొక్క స్తనమే కనుమా!

అనుము – జనుము – సెనగ – మునగ పదాలతో భారతార్థములో చెప్పిన దత్తపది పద్యము

అనుము దుష్టకృత్య మియ్యదంచుఁ గౌరవేయుతోఁ
జనుము వేగనటకు నీవు సంజయాదు లెన్నఁజే
సె నగడొందక హరియంచుఁ జెందుఁగీర్తి నిన్ను న
మ్ము నగధారియంచుఁ జెప్పెముందు ధర్మజాతుడున్

వసంతఋతు వర్ణన

అంత దిగంత దంతుర నిరంతర కాంత వనాంత సంతతా
క్రాంత లతాంత మంతక దురంతక కంతు నిరంతరాంత వా
సంతిక మంతరాంతర నిశాంత లతాంతర కాంత కాంత మ
శ్రాంతము సంతసంబిడె వసంతము సంతత మంతనంతటన్

తర్కవేదాంతాదినైక శాస్త్రాలలో శ్రీ వేలూరి వారికున్న వైదుష్యం అపారమైనది. శతావధాని శ్రీ పిసుపాటి చిదంబరశాస్త్రి, శ్రీ గడియారం రామకృష్ణ శర్మ వంటి దిగ్గంతులైన విద్వత్కవులు శ్రీ వేలూరి వారికి శిష్యులై విశిష్ట సాహితీ వరివస్య చేసారు.

శతావధాని 'శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారి కృతులు – సమీక్ష' అనే అంశంపై సిద్ధాంతవ్యాసం సమర్పించి డా॥ జంధ్యాల మహతీ శంకర్‌గారు డాక్టరేట్ పట్టాను గైకొన్నారు.

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

అనుకుం జూపు ల్దగం దా మదుగులు పుడమిన్ హత్తనీ కేగు లేళ్ళం
గని తేజీ దోలియంటం గదుముచు మెఱుగుల్ గ్రమ్ముచుండంగ ము న్నే
సిన తూపు ల్వెండి యొంటం జెలఁగుచు దునుకల్ చేసి చేనేర్పు మీరం
దన వాలుంగంటి కన్నుల్ దలపుచు మదిలో దాచి యున్నట్టి కూర్మిన్!

ద్రావిడభాష నుండి విడివడి తెనుగు లేదా తెలుగుభాష పుట్టింది 3000 సంవత్సరాల పూర్వం (దాదాపు క్రీ. పూ. 1000). 2000 సంవత్సరాల తరువాత, నన్నయ సృజించిన ఆంధ్ర మహాభారతం కాలాన్ని బట్టి – సంస్కృత శబ్ద బాహుళ్యంతో నిండిన తెలుగు కావ్య భాష అవతరించింది 1000 సంవత్సరాల పూర్వం (క్రీ.శ. 11 వ శతాబ్ది). కాని .. అచ్చమైన తెలుగు భాష (అచ్చ తెనుగు)లో మొదటి కబ్బం అల్లబడింది మాత్రం కేవలం 500 సంవత్సరాల పూర్వం (క్రీ.శ.16వ శతాబ్ది). అంటే.. భాష పుట్టిన 2500 సం.ల తరువాత ఒక పూర్తి అచ్చ తెనుగు కృతిని ఒక తెలుగు కవి రచించాడు. గోల్కొండ సామ్రాజ్యాన్ని పాలించిన ఒక మహమ్మదీయ ప్రభువు – "మాలిక్ ఇబ్రహీం కులీ కుతుబ్ షా" (ఇతనినే ఆనాటి తెలుగు కవులు "మల్కిభరాముడు అన్న నామంతో వ్యవహరించే వారు) పాలనలో – "పొన్నికంటి" వంశోద్భవుడైన "తెలగన" అన్న సార్థక నామధేయం గల కవి ఎంతో ధైర్యంగా ఈ మహత్కార్యానికి పూనుకొని, **'యయాతి చరిత్రము'** అనే తొలి **'అచ్చ తెనుగు కబ్బం'** అందించి, తెలుగు సాహిత్య చరిత్రలో శాశ్వత స్థానాన్ని నిలుపుకొన్నాడు. ఈ **'అవధాన పుష్కరిణి'** మాస పత్రిక ప్రారంభమై సంవత్సర కాలం విజయవంతంగా పూర్తి అయ్యింది. ఈ పత్రిక తొలి సంచిక నుండి ఈ "యయాతి చరిత్రము" అచ్చ తెలుగు కృతిలోని పద్య రత్నాలకు హృద్య వ్యాఖ్యలతో – ఈ **'కావ్యాస్వాదన'** అన్న శీర్షిక కూడ ధారావాహికగా వెలువడుతూ సంవత్సరకాలం పూర్తి అయింది. అటు.. ఈ పత్రికా సంపాదకులుగా సాధించిన ఘనతకు గాను, ఇటు.. ఈ కావ్య వైశిష్ట్యాన్ని గుర్తించి, ఈ శీర్షికా నిర్వహణకు సంవత్సర కాలంగా నాకు కల్పించిన అవకాశానికి గాను – నా సన్మిత్రులు, 'అవధాన ప్రచోదక', 'సాహితీ ప్రభాస' బిరుదాంచితులు శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ గారికి శుభాభినందనలను మరియు హార్దిక ధన్యవాదాలను తెలియజేస్తూ .. ఈ శీర్షిక నిర్వహణ రెండవ సంవత్సరంలోకి (13 వ భాగంలోకి) ప్రవేశిద్దాం!




**'మహాస్రగ్ధర'** ఛందస్సులో రచించబడిన పైన పేర్కొన్న పద్యం – ఆ అచ్చ తెనుగు కృతి – ద్వితీయాశ్వాసం లోని 31వ పద్యం. ఈ ఆశ్వాసం ప్రారంభం నుండి యయాతి మహారాజు, ఇంకా వేటలో రాటుదేలిన యెరుకలు అడవిలో వివిధ రకాల వన్య మృగాలను వేటాడిన వైనాన్ని వర్ణిస్తూ ఉన్న సంగతి మనకు విదితమే! ఈ పద్యంలో రాజు గారి జింకల వేటను వివరిస్తున్నాడు కవి పొన్నికంటి తెలగన. వేట అన్నది వీరరస ప్రధానమైన కార్యం. కానీ దానిని శృంగార రసంతో మేళవించి, కరుణా రసాన్ని కూడ ఒలికిస్తూ వర్ణించడం పొన్నికంటి తెలగన కవికే చెల్లింది. ఆ వివరాలలోనికి వెళ్ళే ముందు .. ఈ పద్యంలో ప్రయోగించిన అచ్చ తెలుగు పదాలను పరిశీలిద్దాం!

1. అనుకు = పలచని (నీరసమైన); 2. అనుకుం జూపుల్ = నిస్సారమైన (లేదా) నీరసమైన చూపులు; 3. తగన్ = ఒప్పుగా; 4. అదుగుల్ = పాదములు; 5. పుడమిన్ = నేలను 6. హత్తనీ కేగు = తగులనీ కుండా పరిగెత్తు; 7. లేళ్ళ గని = జింకలను చూచి; 8. తేజీ = గుర్రాన్ని; 9. తోలి యంటన్ = వాటిని అందుకోవడానికి పరుగెత్తించి; 10. గదుముచు = గద్దిస్తూ; 11. మున్నేసిన = మొదట వేసిన; 12. తూపుల్ = బాణములను; 13. వెండి యొంటన్ = మరల ఒక దానితో; 14. మెఱుగుల్ గ్రమ్ముచుండంగ = మెరుపులు చిమ్ముతుండగా; 15. చెలగుచు = విజృంభిస్తూ; 16. తునుకల్ = ముక్కలు; 17. చేనేర్పు = చేతి నైపుణ్యం; 18. మీరన్ = అతిశయించగా; 19. వాలుగంటి = వాలుకన్నుల చిన్నది యైన ప్రేయసి; 20. తలపుచు = తలపించగా; 21. కూర్మిన్ = ప్రేమ చేత.

ప్రాణ భయం వలన నీరసమైన చూపులతో, తమ పాదాలు నేలను ఆనకుండ పరుగెత్తుతున్న జింకలను చూసి, వాటిని అందుకొనేలా యయాతి ప్రభువు తన గుర్రాన్ని పరుగెత్తించి, గద్దిస్తూ వాటిపై బాణాలు వేసి, అంతలోనే వాటి కన్నులను చూడగానే తన వాలుకన్నుల ప్రేయసి అందమైన కన్నులు తలపుకు వచ్చి, మనస్సులో ఆమెపై దాగి ఉన్న ప్రేమతో, ఆ వెంటనే తన చేతి నైపుణ్యం విజృంభింప జేసి, మరొక బాణంతో మొదటి బాణాలను ముక్కలు చేసాడు.. అని ఈ పద్య తాత్పర్యం!

ఈ పద్యాన్ని .. జింకల చూపులలోని భయానక రసంతో

ప్రారంభించి, మహారాజు వీర రసంతో విజృంభింప జేసి, ఆ పైన ప్రేయసి తలపుతో శృంగార రసాన్ని మేళవించి, ఆ తరువాత ఆ లేళ్ళపై అన్యాపదేశంగా .. కరుణా రసాన్ని చూపుతూ, ఆ ప్రభువు కాపాడినట్లుగా ముగించాడు కవి. నవరసాలలోని నాలుగు ప్రధాన రసాలను ఒక చిన్న పద్యంలోని నాలుగు పాదాలలో కలగలుపుతూ, ఇంత విశేషంగా పోషించడం సామాన్య విషయం కాదు. తెలుగు సాహిత్య చరిత్రలో – పొన్నికంటి తెలగన కవిని అసాధారణమైన అద్భుత కవిగా అంగీకరించక తప్పదు. ఇందులో మరొక విశేషం కూడ ఉంది. వీరాధివీరుడైన ధీరుడు ఒకసారి ప్రయోగించిన బాణాన్ని తిరిగి వెనుకకు తీసుకోకూడదు .. అన్నది ఆర్ష ధర్మం! కాబట్టి వెంటనే దానిని మరొక బాణంతో తునకలు చేసాడని చెప్పి కవీశ్వరుడు యయాతి మహారాజు ధర్మ నిష్ఠను, అట్లాగే అతని అస్త్ర విద్యా కౌశలాన్ని గురించి చెప్పకనే చెప్పి మెప్పించిన తీరును ఎంత పొగిడినా తక్కువే! అల్పాక్షరాలలో అనల్పార్థం గురించి విన్నాం! ఒక కావ్యంలో .. అల్పాక్షరాలలో అనల్పమైన రీతిలో ఒక కవి చేసిన "కావ్య నాయక వ్యక్తిత్వ నిర్మాణ విరాట్ ప్రదర్శన"కు ఈ పద్యం ఒక ప్రతీక!

# 1914వ సంవత్సరంలో వేంకటగిరి సంస్థానములో జరిగిన పిశుపాటి చిదంబరశాస్త్రి గారి అష్టావధానము

**1 దత్తాక్షరి (గ్రీష్మము – కవిరాజవిరాజితము)**

ఆరయుము గ్రీష్మ **(చ)**మత్కృతి
నీభవనాంగణ**(మం)** దవధానము స
త్వరముగఁ జేసెడి కాలము
నందు హి**(తం)**బునున్ వ్యతిరేకముగా
వఱదలు గట్టెడుపట్టులు
స్వేదము వాఱెడు **(క్ష)**త్రియవైభవ! నీ
తర మెటులయ్యెదునయ్య
కళాభుగ**(దః)** క్రమమున్ సహియించుటకున్.

**2. విశ్వనాథప్రార్థన**

శ్లో. దాక్షాయణీసనాథం
రక్షితజగదండ మీక్షితానాథమ్
శ్రీవేంకటగిరినాథం
భూయః ప్రణమామి విశ్వనాథ మహమ్.

**3. వ్యస్తాక్షరి – క్రిందిసంఖ్యలపదము తీయఁబడినవి**

1 2 3
అనుకంపారహితంబు గ్రీష్మము మదీయంబైన
4 5 6
జీవౌషధంబును క్షైత్రంబును దూరదేశమునకున్
7 8 9
బోనిప్ప కొట్టెంగదా యనుకోపంబున
10 11 12
నోయనన్ బికము అరణ్యప్రాంతమందుండి
13 14 15
యంతను తత్స్వాగమనంపు ప్రశ్నము
16 17 18 19 20
అయినన్ దాఁ జేయక ఉండెన్ భువిన్.

**4 నిషిద్ధాక్షరి (ఎలక్ట్రక్ లైటు – కందము)**

క. విద్యుద్రుద్గ్రీష్మకళల్
విద్యోతితము లయి యిచట వెలుఁగుచు నుండెన్
విద్యావన్మతిదర్పణ
సద్యోషిన్మానసాంబుజంబులు వోలెన్.

**5 వివర్గాక్షరము (పురము)**

(నాలుగుపాదములలో ( ) లోని వర్గములు నిషేధింపఁబడినవి)

ఉ. కాంచఁగదయ్య సద్రుచులు గల్గి వెలుంగుచు నుండురీతు ల **(ప)**
ర్యంచితదీప్తు లేర్పడెడి వైభవకోటులు సౌధపంక్తులున్ **(చ)**
మించెడి పట్టణంబుజిగి మీకడఁ జెప్పుట కెట్టివాఁడఁ గీ **(త)**
ర్త్యంచితశౌర్యసంశ్రితుఁడ వయ్యెదునీ విది గుర్తెఱుంగవే? **(ప)**

**6 ఛన్దో భాషణము** (వివరాలు లభించలేదు)

**7 పృష్టకల్పనము (పట్టణము)**

శా. రాజవ్రాతముతోడ నొ ప్పెసఁగి చిత్రం బైన సంపత్తితోఁ
దేజం బొప్పఁగ వెల్గుచుండు బహుదీప్తిన్ విందు గావించి నా
నాజాతిస్ఫురదుద్యమం బగుచు నానందంబు గల్గించుమా
రాజగ్రామణిపట్టణంబు నుతి మీఱం జేయ నాశక్యమే!

**8 రామపాదుకానయనమ్ (మందాక్రాంతా)**

శ్లో. పూర్వం రామే పుర మిహ పరిత్యజ్య యాతే వనాంతం
పశ్చాదేవ త్రుటితహృదయో భీతభీతో నితాంతమ్
గత్వారణ్యం సపది భరతః పాదుకే యాచమానః
ధృత్వా మూర్ధ్నా సముపగతవాన్ స్వస్థలం భ్రాతృభక్తః.

(మిగతా 6వ పేజీలో)

# వ్యాకరణ వరివస్య 13

ఎన్.సిహెచ్. చక్రవర్తి

## ఇత్త్వసంధి విషయం

ఇత్త్వానికి అచ్చు పరమైతే సంధి కొన్ని సందర్భాలలో నిత్యంగా వస్తుంది. కొన్ని సందర్భాలలో నిత్యంగా రాదు. కొన్ని సందర్భాలలో వైకల్పికంగా వస్తుంది.

ఆయా సందర్భాలను పరిశీలిద్దాం.

**నిత్యసంధి: మధ్యమపురుష క్రియల యందు ఇత్తునకు సంధియగును** (సంధి-7)

ఎదుటివారితో మాట్లాడేటప్పుడు అది మధ్యమపురుష. మధ్యమ పురుష క్రియాపదాల్లో మొదటిపదం చివర ఇత్త్వం ఉండి, రెండో పదం మొదట అచ్చు ఉంటే నిత్యసంధి జరుగుతుంది.

ఏలితివి+అపుడు = ఏలితివపుడు

ఏలితి (ఏలితివి అనే అర్థంలోనే) + ఇపుడు = ఏలితిపుడు

ఏలితిరి+ఇపుడు = ఏలితిరిపుడు

మొదలైన రూపాలు ఏర్పడతాయి.

ఇక్కడ మూడు ఉదాహరణల్లోనూ ఇపుడు అని ఒకే అచ్చుతో సంధులు చూపడానికి ప్రత్యేకకారణం ఏమీ లేదు.

ఇలాటి సందర్భాలలో యడాగమం చేసి, ఏలితివి యిపుడు, ఏలితియిపుడు ఏలితిరియిపుడు వంటి రూపాలు చేయరాదు..అవి అసాధురూపాలు అవుతాయి.

**వికల్పసంధి:** ఇది రెండు సందర్భాలలో వస్తుంది.

1. **ఏమ్యాదుల యిత్తునకు సంధి వైకల్పికముగానగు** (సంధి. 5)

ఏమి మొదలైన (ఏమి+ఆదులు=ఏమ్యాదులు - ఇలాటిచోట్ల అంతటా బాలవ్యాకర్త సంస్కృత సంధి మర్యాద పాటించారు.) పదాలలో ఉన్న ఇత్తునకు అచ్చు పరమైతే సంధి వికల్పంగా వస్తుంది.

**ఉదా:** ఏమి +అంటివి =ఏమంటివి (సంధి జరిగిన రూపం)

సంధిరాకపోతే యడాగమం వచ్చి ఏమియంటివి అని అవుతుంది. ఏమంటివి, ఏమియంటివి ఈ రెండు రూపాలు సాధురూపాలే. ఈ రీతిగా...

మరి+ఏమి=మరేమి, మరియేమి వంటి రూపాలు సిద్ధిస్తాయి.

ఏమి ఆదులు అంటే ఏవేవి? అని సందేహం రావచ్చు. కనుక బాలవ్యాకర్త ***ఏమి,మరి, షష్ఠీవిభక్తిలోని కి,అది,అవి, ఇది,ఇవి, ఏది, ఏవి*** మొదలైన పదాలలో ఉండే ఇత్త్వానికి అని చెప్పారు.

2) **క్రియాపదంబులందిత్తునకు సంధి వైకల్పికముగానగు** (సంధి. 6)

క్రియాపదాలలో చివర ఇత్తు ఉంటే వాటికి అచ్చు పరమైతే సంధి వికల్పంగా వస్తుంది. (ఇది మధ్యమపురుష క్రియలకు వర్తించదు)

**ఉదా:** వచ్చిరి +అప్పుడు = వచ్చిరప్పుడు (సంధి వస్తే) వచ్చిరియప్పుడు (సంధి రానప్పుడు యడాగమం వచ్చి) మొదలైన రూపాలు గ్రహించాలి.

**సంధిరాని సందర్భం:**

**క్త్వార్థంబైన యిత్తునకు సంధిలేదు.** (సంధి. 8)

భూతకాలంలో ఉన్న అసమాపక క్రియ క్త్వార్థం. భూతకాల క్రియ అసమాపకంగా ఉండి,చివర ఇత్త్వము ఉంటే దానికి అచ్చు పరమైతే సంధి రాదు..అంటే యడాగమం మాత్రమే వస్తుంది.

**ఉదా:** వచ్చి+ఇచ్చెను =వచ్చియిచ్చెను అని అవుతుంది.

ఈ నిషేధం లేకుంటే వచ్చిచ్చెను వంటి అసాధురూపాలు ఏర్పడతాయి. ఈ ప్రమాదాన్ని నివారించడానికి బాలవ్యాకర్త ఈ నిషేధం చేసారు. వాస్తవానికి కొందరు పూర్వకవులు క్త్వార్థ ఇకారానికి సంధి చేసారు. అవి అతి విరళం.

ఉదాహరణకు విజయవిలాసంలో చేమకూర కవి ***ఒనర్చిటు (ఒనర్చి+ఇటు)*** వంటి ప్రయోగాలు చేసాడు. అలాగే మరి కొందరు కవులు చేసారు. విరళంగా ఉన్నది కనుకనే సూరిగారు ఈ విషయం ప్రస్తావించి ఉండరు. ప్రస్తావిస్తే ఆమోదించినట్లు భావించి, తరువాతివారు ఈ ప్రయోగాలు యథేచ్ఛగా చేసి, అసాధు రూపాలు సృష్టిస్తారనే ఉద్దేశమూ కావచ్చు. బాల వ్యాకరణము ప్రధానంగా కవిత్రయప్రయోగాలవరకే పరిమితం కావడం కూడా మరొకకారణం కావచ్చు.

ఏదైనా ఆధునికులు కూడా క్త్వార్థేకార సంధి పరిహరించడం మేలు.. లేకుంటే అనేకంగా అసాధురూపాలు ఉత్పన్నం అవుతాయి.

(5వ పేజీ తరువాయి)

### పిశుపాటి చిదంబరశాస్త్రి గారి అష్టావధానము

**9 సమస్య**

గీ. రామరావణులకు యుద్ధరంగమందు
సంభ్రమము మీఱ క్షోభంబు జరుగునపుడు
రాలెఁ దారలు గ్రహములు వ్రాలి పడియెఁ
(గడలఁ బువు లుప్పతిల్లె నకాలముననె.)

**10 ఏకసంధాగ్రహము (అన్యదీయము)**

చ. ఇటుల మనోహరంబు లగునీగృహరాజివిరాజ మై సము
త్కటహయవారణౌఘసువికాసిత మై పురిచుట్టుఁ దోటలున్
దిట మగుకోట పేఁటలును దృష్టి వహించుచు మించుకీర్తి వేం
కటగిరి యొప్పుచుండుఁ గటకంబులు నుత్తమనామయుక్త మై.

# విశిష్ట తెలుగు భాషా వైభవం

## 13 ఛందః ప్రాముఖ్యం




- డా. సంగనభట్ల నరసయ్య

కందార్థాలు రాసేవారు కందం సగం రాసి గేయంలోకి మారేవారు యక్షగానాల్లో ఈ ప్రక్రియను రాసేవారు. పెద్ద పండితులు కాకున్నా నాటక రచయితలే. ఇవి ఛందోగేయ మిశ్రమ ప్రక్రియలు. జానపదుల జీవనంలో భాగాలు.

పండితుల సంగతి చెప్పనక్కరలేదు. మహాకవులు కూడా ఛందఃప్రయోగప్రియులే. నన్నయ మహాకవి దేశి ఛందస్సులే అధికంగా వాడినా, వృత్తపద్యాలకు పెద్దపీట వేసాడు. తిక్కన విశేషఛందాల ప్రయోగం తెలుగు సాహిత్యంలో విశిష్టప్రయోగం. పాలుకురికి ద్విపద పట్టాభిషేకం, శ్రీనాథుని సీసం, పోతన్న దండకాలు, తెలుగు సాహిత్య శోభను ఇనుమడింపజేసాయి. పెదమల్లినాథుడు, చరిగొండ ధర్మన, రామరాజ భూషణులు శతలేఖిన్యవధానాలు, రాయలవారి సభలో, బయటా వచ్చిన పాండిత్య స్ఫోరకాలు, చమత్కారాలు, సమస్యాపూరణ పద్యాలు తెలుగువారి నోట నేటికీ నానుతున్నాయి. చాటువుల ఛందః చమత్కారాలకైతే లెక్కే లేదు. చాటువుల పద్యప్రాభవాలు వేనోళ్ల చాటుతున్నవే. (తెలుగులో చాటు కవిత్వమని నేనో గ్రంథం రాసాను. దానిలో వివరాలున్నాయి.) ఛందాల్లోని అసలు కవుల పేర్లు గుప్తంగా రాసినవి పద్యప్రాభవాన్ని చెప్పేవే.

అవధానాల సంగతి ఇంక చెప్పనవసరం లేదు. మనముందే ఆ మహాకవులు సద్యఃస్ఫూర్తితో, ధారతో, ధారణాపటిమతో, తడుముకోకుండా, తడబడకుండా అనేక ఛందస్సుల్లో వృత్తమైనా, జాతి ఐనా, ఉపజాతి ఐనా, విశేషవృత్తమైనా, గేయమైనా ప్రాశ్నికుల కోరికల ననుసరించి అల్లుతుంటే మనం నోరువెళ్లబెట్టాల్సిందేగా! వారి చేతుల్లో కాగితం లేదు, కలం లేదు. అద్భుత కవిత్వం, అద్భుతమైన అల్లిక వారిని సరస్వతీమూర్తులుగా మనకళ్లముందే ఆవిర్భవింపజేయడం ఒక్క తెలుగు జాతికే చెల్లింది. వీటిక్కారణం ఛందస్సుల అల్లికే గదా!

ఛందశ్శాస్త్రంలో ప్రదర్శించే గణవ్య వస్థ, దేశ్యగణాల నిర్మాణం, దానికి ఏర్పాటు చేసిన ప్రస్తార వ్యవస్థ, సూర్య(త్రిమాత్రిక), ఇంద్ర (పంచమాత్రిక), చంద్ర (ఉపరిసంఖ్యామాత్ర). వ్యవస్థ సుమారుగా సరిపోయ్యేదే. అదే దేశి ఛందస్సులు గేయమూలాలు గలవన్న రహస్యాన్ని ఆవిష్కరిస్తుంది.

**వంకాయ వండాను వరికూడు వార్చాను**
**తినమని చెప్పవే తడికో తడిక**

– అని గేయరూపంలో పాడితే పామరులు గేయసౌందర్యానికి ఆనందిస్తే, పండితులు సీసపద్యమని శాస్త్రసౌందర్యానికి ఆనందిస్తారు. ఒక్కోపాదం రెండర్థాలుగా, ఒక్కో అర్థం, తిరిగి మరి ఒకరెండు అర్థాలుగా విడిపోయి, పాతిక భాగానికి యతులు, ప్రాసయతులు వేసి సీసం నడిపిస్తుంటే లయానందం పొందని తెలుగువారుంటారా?

నాలుగు పాదాలు నాలుగు విభాగాలుగా, విధాలుగా, నాలుగు అంశాలుగా వర్ణించి, పైగీతిలో ఉపసంహారం (ముగింపు) కేవలం ఒక్క సీసపద్యంలో 'నమూనా నిర్మాణం'గా ఉత్కృష్టంగా ఉంది. భావాలకు అనుగుణంగా, పరిమాణ ప్రమాణంగా వివిధ దైర్ఘ్యాలతో తెలుగు ఛందస్సులు కవులకు అందుబాటులో ఉన్నాయి.

కందం(షడ్విధ కంద భేదాలు), ద్విపద, మంజరీ ద్విపద, తరువోజ, అక్కరలు(పంచవిధ భేదాలు,) ఉత్సాహ(త్రివిధ భేదాలు), త్రి, చతుష్పదలు, షడ్విధ షట్పదలు, చతుర్విధ విషమ గీతులు, ద్వివిధి సమగీతులు(ఆటవెలది, తేటగీతులు), దశవిధ ఉద్ధురమాలా ఛందాలు, నవవిధ రగడలు, నవవిధ సీసభేదములు, 21 యతి, ప్రాస లక్షిత సీసభేదములు, త్రిస్రాది పంచవిధ తాళ గణభేదాలు, వీటికి తోడు సంస్కృతం నుండి అరువు తెచ్చుకున్న ఉత్పలమాలాది శతవిధ వృత్తభేదాలు, ఒక్కసారి పరిశీలిస్తే తెలుగు పద్యం ఎంత విస్తృతరూపమో అర్థమవుతుంది.

పదిహేను వందల సంవత్సరాలుగా ఇవి తెలుగు భాషా వికాసానికి, తెలుగు వైభవం ప్రాభవాలకు అమేయమైన సహాయాన్ని, వైశద్యాన్ని, వైశారద్యాన్ని ఇచ్చాయి. తెలుగు జాతి గర్వంగా తలెత్తుకునేలా కవిత్వ చషకాలైనాయి.

గుడి కూలును, నుయి పూడును,
వడి నీళ్లను చెరువు తెగును, వనముల్ ఖిలమౌ,
చెడనిది పద్యం బొక్కటె
విడదీయని జాతిబద్ధ విద్యయె వినుమా!

**(సశేషం)**

# అంశావలోకనం

శతావధాని ఆముదాల మురళి

## కవితల వేల్పు గిడ్డి అవధాని రామారెడ్డి

(గత సంచిక తరువాయి)

'దృఢసత్త్వంబున చీమ తుమ్మెగదరాదిగ్గంతులల్లాడగన్' అన్న సమస్యకు నరాల వారి కంటే ముందువచ్చిన పురణలలో మోచర్ల వెంకన్నగారిదిలా ఉన్నది.

సధులీశోర్వి చలింప నిర్జరవరుల్ శంకింప భేరీనికా
యధమత్కారత నిద్ర లేచి దశకంఠామర్త్య విద్వత్పరీ
వృఢసోదర్యుడు లేచిరా వృథ యొనర్చెన్ నాసికాంతస్థమై
దృఢసత్త్వంబున చీమ; తుమ్మెగదరా దిగ్గంతులల్లాడగన్ –

ఇందులో కుంభకర్ణుని నిద్రలేపే సందర్భాన్ని వాడారు. కొప్పరపు సోదరకవులు భారతంలో యుద్ధఘట్టం, సైంధవుడు పద్మవ్యూహం లోనికి వెళ్లకుండా పాండవులను ఆపిన సందర్భాన్ని తీసుకొని అర్థాంతర న్యాసాలంకారంతో ఇలా పూరించారు.

ద్రఢిమన్ మీరిన పాండుపుత్రుల మహాస్త్రప్రౌఢులన్ రాట్పరీ
వృఢలోకాద్భుత విక్రమక్రమము నాపెన్ సైంధవభ్రష్టుడా
దిధులీంద్రోపములైన నీశ్వర వరాధిక్యంబునన్ జేసి హా!
దృఢసత్త్వంబున చీమ తుమ్మెగదరా దిగ్గంతులల్లాడగన్

శ్రీ నరాల రామారెడ్డిగారి పూరణ ఇలా ఉన్నది

దృఢ ధాత్రీరుహ నిర్మితాద్రివర సద్రీచీన మంచంబునన్
దృఢగాత్రుండగు కుంభకర్ణ దనుజాధీశుండు నిద్రించుచున్
దృఢసంకల్పము పూని ముక్కుపుటమున్ తీవ్రంబుగా కుట్టగన్
దృఢసత్త్వంబున చీమ, తుమ్మెగదరా! దిగ్గంతులల్లాడగన్ –

కుంభకర్ణుని అంశమే, 'దృఢ' ప్రాసే కాని పద్యనిర్మాణంలో ఉన్న చాకచాక్యం విశిష్టమైనది. మొదటి పాదమంతా మంచమే. కుంభకర్ణుని వంటి దీర్ఘకాయుడు నిద్రించాలంటే అంతటి పొడవటి గట్టిమంచం అవసరమే కదా! ఇదీ స్వారస్యం. ప్రాసకోసం పూర్వికులను అనుసరించలేదు, పూరణలో స్వీయవ్యక్తిత్వాన్ని వదులుకోలేదు. అన్నింటికీ మించి గొంతులో పచ్చివెలక్కాయలా ఇరుక్కునే సమస్యను శ్రీ రెడ్డిగారు చీమకుర్తిలో పూరించారు. అది "ద్రుపదరాజ పుత్రికకు నల్గురె భర్తలు నమ్మకంబుగన్" ఇందులో మొదటి చిక్కుముడి ఛందస్సు. ఇది మొదటి లఘువు లోపించిన చంపకమాలా వృత్తము. ప్రాస 'ద్రు', దానికి ముందున్న అక్షరం గురువు కారాదు. పైగా 'నల్గురె'లోని 'న'కు యతి సరిపోయే అక్షరాలు అంటే న, ణ, జ్ఞలు గాని బిందుపూర్వక తవర్గాక్షరం గాని ఉండాలి. ఇదంతా ఛందస్సుకు సంబంధించిన వ్యవహారం. రెండవముడి అందులోని విరుద్ధార్థం. రాత్రికంతా ఆలోచించి, నలుగురు పండితులతో చర్చించి పద్యమల్లే అవకాశం లేదు. సద్యః స్ఫురణతో ఇన్ని చిక్కుముడులు విడిపోయే పద్యం ఆశువుగా అల్లాలి. శ్రీనరాలవారి పూరణ చూడండి.

ఎద్రిచిన పాండుపుత్రుల వధింపక వీడుమటంచు కుంతి తా
నద్రుచు వచింప కర్ణుడిటులాడెను "మాతరో! మాట యిచ్చితిన్
చిద్రుపలు గాగ గాండివము చిక్కిన ఫల్గుణు జంపివైతు గా
న, ద్రుపద రాజపుత్రికకు నల్గురె భర్తలు నమ్మకంబుగన్

అద్రుచు, విద్రుచు, పద్రుచు, చిద్రుపలు ఇత్యాది పదాలలోని రేఫం యొక్క ఉనిక తత్పూర్వస్వరం మీద లేని కారణం చేత అ, వి, ప, చి లు గురువులు కావు. 'సంయుక్తాక్షరమునకు ముందున్న అక్షరం గురువవుతుంది' అన్న నియమానికి ఇది మినహాయింపు. ఇన్ని ఒడుపులు తెలిసి ఉండి, సమస్యకు సరిపోయే సందర్భాన్ని మహాభారతేతిహాస సాగరం నుండి ఎన్నుకొని సున్నితపుత్రాసులో బెట్టి తూచినంత నిఖ్ఖచ్చిగా పద్యమల్లడం నరాల వారికే చెల్లింది. అవధానానికి వెన్నెముక వంటి సమస్యాపూరణ ఔచితీమంతంగా ఉంటే సగం అవధానం అయిపోయినట్లే. శ్రీ నరాల వారి సమస్యాపూరణలు పాఠాంతరాల నపేక్షించినవి. భావితరాలకు గీటురాళ్ళు.

అవధానంలో మరొక కీలకాంశం దత్తపది. ప్రాశ్నికులు ఇచ్చే నాలుగు పదాలను కోరిన ఛందస్సులో ఉద్దిష్టార్థంలో నిబంధించడం అసిధారావ్రతమే. అందులో కూడా తన పని నిరూపించుకొని పసందైన పద్యాలను శ్రీరామారెడ్డిగారు వేదికలపై చెప్పారు. ప్రాచీన అవధానాలను పరిశీలిస్తే పృచ్ఛకులు ప్రాసస్థానంలోనో, యతిదగ్గరో చక్కగా అమరిపోయే పదాలను ఎక్కువశాతం ఇచ్చినట్లు తెలుస్తున్నది. ఆధునిక అవధానాల్లో ప్రాశ్నికులు అలాంటి నియమాలేవీ పాటించకపోగా అన్యదేశ్యాలనే ఎక్కువగా ఇస్తున్నారు. అవధానికి సరైన స్ఫురణ రాకపోతే ఇక దత్తపది పద్యం శ్మశానంలో రంగవల్లిలా వెలవెలబోతుంది. శ్రీరామారెడ్డిగారు అటువంటి అన్యదేశ్యాలను కూడా ఆంధ్రానికి లొంగదీసి రాగాలు పలికించారు. తిరుపతిలో **తాజా, ఖాజా, సోజా, మేజా** పదాలను రామాయణార్థంలో చెప్పమని అడిగినప్పుడు ఎంత తాజా పద్యం చెప్పారో చూడండి.

తాజాంబునదగాత్రి సీత తన చెంతన్ రాముడే శౌర్యరే
ఖాజాతిస్థితి చంద్రశేఖర ధనుష్ఖండంబు గావింప వా
సోజాతిప్రసవోత్థ సౌరభము మెచ్చుల్ నింప అందాల మో
మే జాబిల్లిగ వెల్లెనౌర సుషమాహేవాక శిల్పాకృతిన్

దత్తపదాల కోసం సమాసాలను సృష్టించిన భావం పాఠకుల కేమాత్రం కలుగని విధంగా నిరాతంక గంగాజల ప్రవాహంలా పద్యం సాగిపోయింది. అలాగే కానీ, **టోపీ, హ్యాపీ, కూపీ పదాలతో రాకెట్లు, జాకెట్లు, పాకెట్లు, లాకెట్లు పదాలతో, బీరు, బ్రాందీ, విస్కీ, రమ్** అనే పదాలతో కూడా పద్యాలను చక్కగా చెప్పారు. అంతేకాదు **కోకో, కబాడీ, క్రికెట్లు, వాలీబాలుతో** కూడా ఆడుకున్నారు. ఏ అర్థమూ లేని పదాల నిచ్చినప్పుడు అర్థవంతంగా పద్యం చెప్పడం అంత సులభం కాదు. నొస్సం అవధానంలో వీరికి ననన, నినిని, నునును, నెనెనె అన్న పదాలనిచ్చి రామాయణార్థంలో పద్యం చెప్పమన్నప్పుడు శ్రీరెడ్డిగారు చెప్పిన పద్యం చూద్దాం.

నన నలువైన ముగ్ధ వదనమ్మున వెన్నెల పొంగిపోవ, మా
నిని నిలువెల్ల పొంగి కమనీయ మధూక లతాంతమాలి పూ
నును నునుపైన హస్తముల నూతనరాగము పల్లవింప నా
నెనె నెనరైన రాఘవుని నెమ్మది విచ్చిన కన్నుదోయితో

అవధాన ప్రక్రియ మీద ఉన్న అన్ని ఆరోపణలను పరాస్తం చేయడానికి ఈ ఒక్క పద్యం చాలదా? 'న' గుణింతం ఎంత అర్థవంతంగా, నాణెంగా పద్యంలో ఒదిగిపోయిందో కదా!

వర్ణనా నిపుణుడు కదా కవి. కవికాక అవధాని కాలేడు కదా! అవధానంలో వర్ణన నిర్నిషేధమైన అంశం. మిగిలినవన్నీ కాళ్ళు గట్టి పరుగెత్తమనడం వంటివి. వర్ణన మైదానంలో పరుగు దీయడం వంటిది. అవధాని నైపుణ్యానికి నిరర్గళమైన పరీక్షయిది. పూర్వకాలపు అవధానాల్లో వర్ణనాంశాలలో అష్టవిధ నాయకలు, ఋతువులు, రసాలు మొదలగునవి తరచుగా ఉండి సమకాలీన సామాజికాంశాలు సకృత్తుగా ఉండేవి. ఇప్పుడు దాదాపు అన్నీ సామాజిక వర్ణనలే ఉంటూ ఎడనెడ పౌరాణిక అంశాలు ఉంటున్నాయి. ఏ అంశమైనా, ఏ ఛందస్సైనా రసరమ్యంగా హృద్యానవద్యంగా అవధాని పద్యమల్ల గలగాలి. అటువంటి నికషాయమాన వర్ణనలకు మకుటాయమాన అవధాని శ్రీరామారెడ్డిగారు.

గడివేముల అవధానంలో పడుచుపెళ్ళామున్న ముసలివాణ్ణి వర్ణించినవైన మిట్లున్నది.

చిదిమిన పాలుగారు జిగి చెక్కుల నిండిన లేత సిగ్గుతో
ముదమున చెంతచేరినది ముద్దుల భామిని - భర్తయన్నచో
ముదిరిన బెండకాయ తన ముచ్చట తీర్చుకొనంగలేడు - సం
పదవలె కాచుచుండు తన భార్యను ప్రాణము కన్నమిన్నగన్

ఎంత చమత్కారం? ఎంత వ్యంగ్యం? మధ్యలో 'ముదిరిన బెండకాయ' అన్న నుడికారం, 'చిదిమిన పాలుగారు' అన్న జాతీయం వెరసి వెలసిన వర్ణనా నైపుణ్యం, వెల్లి విరిసిన కవిత్వం.

రాయలసీమ కరువు, రైతుకష్టాలు నిరంతర సామాజికాంశాలు. అవధానికి కూడా అవగాహన ఉన్న విషయమే. కడపలో ఆ విషయం వర్ణనాంశంగా ఇచ్చినప్పుడు.

బ్రదుకులు వాడిపోయె; పలువన్నెల పైరులు మాడిపోయె, మా
పెదవులు మాసిపోయినవి వెన్నెల వెల్గులు, క్షామరాక్షసీ
పదయుగ తీవ్రఘట్టనల పచ్చని మేనులు బ్రద్దలయ్యె నీ
రదములు మోసగించినవి రాయలసీమ దరిద్రసీమగా - అని

వర్ణించారు. రత్నాలసీమ దరిద్రసీమగా మారిపోవడానికి కారణాలు, దాని పర్యవసానాలు, చెబుతూ 'వాడిపోయె', 'మాడిపోయె', 'మాసిపోయినవి' 'బ్రద్దలయ్యె', మోసగించినవి అన్న క్రియాపదాలను సముచిత స్థానంలో ప్రయోగించడం వల్ల అభివ్యక్తిలోని తీవ్రత, సమగ్రత ద్యోతకమౌతున్నది. పేకాట మీద కూడా మంచి సీసపద్యాన్ని చెప్పిన ఘనత శ్రీనరాల వారిది. కవి సంగతి ఎలా ఉన్నా అవధానికి విధినిషేధాలుండవు, పృచ్ఛకుని అభీష్టం మేరకు పద్య ప్రసూన ప్రసవం జరుగుతుంది. ప్రథమ స్వాతంత్ర్యయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డిని వర్ణిస్తూ చెప్పినపద్యం చూద్దాం.

వీరావేశము రక్తనాళముల జృంభింపన్ ప్రతాపంబునన్
క్రూరస్వాంతులు నాంగ్లముష్కరుల విద్రోహంబు గర్హించుచున్
ధీరత్వంబున మాతృదేశ విమలాదేశంబు దీపింపంగా
హోరిక్రీడల ప్రజ్వలించె నరసింహారెడ్డి సామాన్యుడే

పద్యం ఎత్తుగడ, ఛందస్సును ఎన్నుకోవడం, నరసింహారెడ్డి పేరున సరిగ్గా యతి స్థానంలో కూర్చోబెట్టడం మొదలు అంశాలన్నీ పద్యరచనకు అవధానవిద్యకు అవసరమైన పాఠాలనడంలో ఎలాంటి సందేహం లేదు. **"గంటంబు పెట్టినా కావ్యలోకమ్మున రమ్య పద్యమ్ములు రాశిపోయు"** అంటే శ్రీరామారెడ్డిగారు శ్రీకృష్ణదేవరాయలను వర్ణిస్తూ **"అతడు తెలుగువారల హృదయాంతరాల పసిడి వెలుగులు నింపిన రసికవరుడు"** అన్నారు. సరిగ్గా ఈ మాటలే నరాల వారికి కూడా సరిపోతాయి.

ఆశువును చమత్కారంగా నడిపించడంలో వీరికి వీరే సాటి. గుంతకల్లు అవధానంలో తమిళసోదరుల కోసం ఏర్పాటు చేసిన తెలుగు గంగ ప్రాజెక్టును గూర్చి చెబుతూ...

(మిగతా 15వ పేజీలో)

## శ్రీ నారాయణీ అవధాన వేదిక మరియు అవధాన విద్యా వికాస పరిషత్తు హైదరాబాదు వారి సంయుక్త నిర్వహణలో

# డా. వేదాల గాయత్రీ దేవి గారి 26వ అష్టావధానం 16.08.2026

**సభాధ్యక్షులు:** మరుమాముల దత్తాత్రేయశర్మ

**సంచాలకులు:** కటకం వేంకటరామశర్మ

**నిషిద్ధాక్షరి:** సరస్వతీ రామశర్మ

శ్రీ(ర)మా(త)న్యన్(వ) భూ(మ)వ(న) ంద్యన్
(ప)రామా(స)ంచత్(గ)చి(–)త్త (బ)రా(జ)మ(–)ప్రా(న)క
(మ)ట(మ)దీ(ప)క్షా

కం. శ్రీమాన్యన్ భూవంద్యన్
రామాంచత్ చిత్త రామప్రాకట దీక్షా
రామను, వేదవతిని బహు
స్తేమంబున నేను గొల్తు సీతామాతన్!

**సమస్య:** పి.ఎన్. నాగేశ్వరరావు

**ద్రోణాచార్యుల ధైర్యసాహసములే, దుర్యోధనున్ గూల్చెగా!**

శా. ప్రాణాపాయమటంచు యుద్ధవనిలో భవ్యాత్ముడత్యంతమున్
శ్రేణుల్గా విభజించిసైన్యముల, తా ఛీత్కారముల్ చేసి, సం
త్రాణమ్మున్ మరి జేయబోక గదిసెన్ తద్ శిష్యరూపుండునౌ
ద్రోణాచార్యుల ధైర్యసాహసములే, దుర్యోధనున్ గూల్చెగా!

**దత్తపది:** ఉప్పులపాటి కుసుమ కుమారి

**వేదగాయత్రిని స్తుతించుట**

**వేద అనే పదము 4 పాదములలో వివిధార్థములలో చెప్పాలి**

మ.కో. (వేద)నాదము దివ్య భావము విశ్వమాతకు మంత్రమై
(వేద)నమ్ముల ద్రుంచు తల్లికి వేనమస్సుల హారమై




(వేద)పాఠక కంఠ మాధురి విస్తృతమ్ముగు రూపమై
(వే, ద)యాబ్ధిని ముంచి బ్రోచుత ప్రీతి లోకములెల్లడన్!!

**వర్ణన:** డా. భోగయగారి చంద్రశేఖర శర్మ

**పరోపకారార్ధమిదం శరీరం అనేవిధంగా ప్రకృతి ఉపయోగపడాలని**

మ.కో. పర్వతమ్ములు వృక్ష జాతులు పంచు భాగ్యము లెన్నియో
పర్వమై భువి పంచ భూతపు భవ్య గాథలు జ్ఞానమై
నుర్వి పొంగెడి వాగు వంకలు నుద్భవించెడి పుణ్యమై
సర్వకాలము మేలు సేయును సాధుమానవ శ్రేయమై!!

**న్యస్తాక్షరి:** ఆరవల్లి శ్రీదేవి

**స్వా-తం-త్ర్య-ము అనే అక్షరములు 1-2-3-6 స్థానములలో వుంచి స్వతంత్ర భారతం అనే అంశంపైన చెప్పాలి**

శా. (స్వా)తంత్ర్యావని భారతాంబ మురిసెన్ సౌజన్యతామూర్తియై
చే(తం)బుల్ వర దేశభక్తి యుతమై సేవింపగా దేశమున్
స్వాతం(త్ర్య)మ్మను జాతికేతన రుచుల్ సంతోషమందించగా
భూతాత్ముల్ శుభ(ము)ఖ్య వాక్య కథనా భూషల్ తగన్ గూర్చిరే!!

**ఆశువు:** తాడూరి రామకుమారశర్మ

**ఛందోభాషణము:** ముద్దు రాజయ్య

**అప్రస్తుత ప్రసంగం:** డా॥ వొజ్జల శరత్‌బాబు



## తెలుగు అసోసియేషన్ ఆఫ్ మెట్రో అట్లాంటా (తామా) నిర్వహణలో

# మేడసాని మోహన్‌గారి అష్టావధానం

**27.07.2003**

**నిషిద్ధాక్షరి: వేణు దశిగి**

**అమ్మను గూర్చి / అమ్మ ప్రేమ మీద పద్యం**

**నిషిద్ధాక్షరం:** ర హ జ క మ మ హ జ య య త

**తొలిపాదం:** శ్రీ మ యా త్మ యె సా ర్ద యై శ్రే ష్ట మా న్య

**నిషిద్ధాక్షరం:** వ గ స స వ య ప య మ వ మ త చ

**రెండవపాదం:** భా వ నా కా ర గా భ వ భ ద్ర య గు ట

తే.గీ. శ్రీమయాత్మయె సార్ద్రయై శ్రేష్ఠ మాన్య
భావనాకారగా భవభద్రయగుట
తల్లి వాత్సల్య గుణ కల్పవల్లియగుచు
అఖిల సృష్టికారాధ్యయై అలరునెపుడు

**న్యస్తాక్షరి: భాగవతుల గోపి**

**సత్యభామ అలుక మత్తకోకిలలో**

**1-2-ఖ్య, 2-14-చి, 3-13-పా, 4-3-త**

మ.కో. సఖ్యతన్‌విడి సత్యభామ ప్రసన్న భావ విదూరయై
ప్రాఖ్యమూర్తిని కృష్ణ దేవుని పాయ జూచిన వైనమున్
ముఖ్యమంచు దలంప వచ్చునె భూరి పావనుడైన చిత్
సౌఖ్య తత్పరు పంకజాక్షుని సన్నుతించుట ఒప్పుగున్

**దత్తపది: డా.బి. కె. మోహన్**

**క్షేత్రం, గాత్రం, సూత్రం, క్షాత్రం పదాలతో కురుక్షేత్ర యుద్ధవర్ణన**

ఉ. క్షేత్రము ధర్మ బంధుర విశిష్టము శ్రీహరి గీతికా వచో
గాత్రము తోడ, నర్జునుని క్రమబలోన్నతి పెంపుజేయ తత్
సూత్రము ధర్మ దిగ్విజయ శోభనమై కురు సంగరంబులో
క్షాత్రము సార్థకంబుగ ప్రశస్తత పాండవులందిరెంతయున్

**సమస్య: డా. పూడిపెద్ది శేషు శర్మ**

**కారుల కాన రావు ఎటుగాంచిన యీ పురి వాడ వాడలన్**

ఉ. భూరి మహత్క్రియా సుగుణ భూషణులై చరియించువారలే
యీరమణీయ భూమి వశియించుచునుండిరి నిత్య ధీమయ
ప్రారభమాణ వర్తనులు భాసిలు చుండుట జేతనే అహం
కారుల కాన రావు ఎటుగాంచిన యీ పురి వాడ వాడలన్

**వర్ణన: యెల్లంరాజు శ్యాం సుందర్**

**కుమార సంభవ సంకల్ప దీక్షలోనున్న పార్వతీ పరమేశ్వరుల చెంతకు విఘ్నేశ్వరుడు వచ్చిన విశేషాన్ని ఉత్పలమాలలో వర్ణించాలి.**

ఉ. హస్తిముఖుండు విఘ్నముల నాపదలన్ తొలగించువాడు వి
ధ్వస్తము సేయునే శివుని భావన? తద్గతులాలకించి సు
ప్రస్తుత లీల సోదరుని రాజిత జన్మకు తల్లిదండ్రులన్
ప్రస్తుతి చేసియుండును శుభంకరుడై, శుభద ప్రసన్నుడై

**కావ్యపఠనం: చెన్నుభొట్ల వెంకట్**

శా. ప్రాంచద్భూషణ బాహుమూల గతితో పాలిండ్లు పొంగార పై
యంచుల్‌మోవగ కౌగిలించి యధరంబానింప హా శ్రీహరీ
యంచున్‌బ్రాహ్మణుడోరమోమిడి తదీయాంసద్వయంబంటిపో
మ్మంచున్‌ద్రోచె కలంచునే సతుల మాయల్‌ధీర చిత్తంబులన్!
మనుచరిత్ర

చ. ప్రతిమల పెండ్లిసేయుటకు వందల వేలు వ్యయించు గాని దుః
ఖిత మతులైన పేదల ఫకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్పదీ భరతమేదిని ముప్పదిమూడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్య విహీనుల క్షుత్తులారునే !
గబ్బిలం

**ఆశువు: పెమ్మరాజు వేణుగోపాలరావు**

**1. బ్రహ్మ, సరస్వతి అట్లాంటా వెంకటేశ్వరుని గుడికి వచ్చిప్పటి వారి సంవాదం**

శా. శ్రీమద్వేంకట శైల వల్లభుడు వాసింగాంచునెచ్చోట, నే
నామూర్తిన్‌ప్రభవించు నాకిచట దివ్యారూఢి వున్నట్టులే
భామా యెంచు, వచించు తాను విని శుంభత్స్ఫాక్షలాపాత్ముడై,
ఆమోదించును భారతీజనని సాహో ర్ద స్ఫుర న్మూ ర్తియై?

**2. జీవుడు మాతృగర్భంలో వేదనను అనుభవిస్తూ, తనని ఉద్ధరించమని భగవంతుణ్ణి వేడుకోవటం**

శా. పిండోత్పత్తి విధిన్‌విషాద గతులన్‌పెంపారగా చేతువా?
చండాఖండల లోకమండల లసత్‌సౌందర్య క్రీడా కృతిన్
ఖండింపన్‌తగనయ్య నేనిపుడు నీ కారుణ్య సంపత్తి బ్ర
హ్మాండవ్యాప్తము నన్ను కావుము విషాదాంభోధి దాటించుమా!

**అప్రస్తుతం: ఫణి డొక్కా**

**ప్ర:** అవధానిగారూ..మా ప్రెసిడెంటుగారు పరిచయ ప్రసంగం చేస్తూ మీరు రైతుబిడ్డ అని చెప్పారుకదా, "రైతుబిడ్డలో ఎన్‌టీఆర్ కదండీ"

**స:** మీ వుద్దేశ్యంలో ఆయనొక్కరే రైతుబిడ్డ అనుకుంటున్నట్లుగా వుంది. వేరే వారెవరూ రైతు బిడ్డకాకూడదా? మన మందరమూ వ్యవసాయం చేస్తూనే వున్నాము. నేను సాహితీ వ్యవసాయం చేస్తున్నాను. ప్రస్తుతం మీ వ్యవసాయం అప్రస్తుతం.

**ప్ర)** అందమందు కోతి అరవపిల్ల అన్నాడు కదా శ్రీనాథుడు, మరి తెలుగు పిల్ల మాటేవిటని?

**స:** ఆయన స్వీయానుభవాన్ని చెప్పాడు, ఆయనకు తారసపడ్డ వారి గురించి. మీకట్టి అనుభవం లేదు కదా.

# యతిప్రాసవివేచనము - 2

- చిటితోటి విజయకుమార్




పరపదం యొక్క మొదటి అక్షరానికి యతి చెప్పడం 'స్వరప్రధాన యతి' అవుతుంది. (సంధిపరంగా వచ్చిన ఆదేశ వర్ణాలతో కూడా యతి చేయవచ్చు. రకరకాల యతుల పేర్లు గుర్తుపెట్టుకోవడం కష్టం కనుక, వీటినన్నిటినీ కలిపి ఈ భాగంలోనే వివరిస్తున్నాను).

ఈ భాగంలో మనం పూర్వపరాలకు ఏకాదేశము (అష్టాధ్యాయి 6.1.84-111) అనే సంధి కార్యం, తెలుగు పద్యాలలోని యతులపై ఎలాంటి ప్రభావం చూపుతుందో చూద్దాం.

1. గుణసంధి (అష్టాధ్యాయి 6.1.87)

అ, ఆ లకు ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, (హ్రస్వమైనా, దీర్ఘమైనా) పరమైనప్పుడు వరుసగా ఏ, ఓ, అర్, అల్ లు ఏకాదేశమవుతాయి. అప్పుడు:

- 'ఇ, ఈ' లకు గుణంగా వచ్చిన ఏకారంతో,
- 'ఉ, ఊ' లకు గుణంగా వచ్చిన ఓకారంతో,
- 'ఋ, ౠ' లకు గుణంగా వచ్చిన 'అర్' తో యతి చెల్లుతుంది.

ఉదాహరణలు:

అ) 'ఇ, ఈ' లకు, మరియు 'ఏ' అక్షరానికి గుణసంధిగతమైన 'ఏ' తో యతి:

- ఇంకొక యేఁడు పోయిన నరేశ్వర! (భాగవతం 9-418) - నర + ఈశ్వర = నరేశ్వర.
- ఈ వనజాతనేత్రుఁ బరమేశు (భాగవతం 7-459) - పరమ + ఈశు = పరమేశు.
- ఏలిన దేవయానికి నరేశ్వర! (భారతం ఆది. 3-174) - నర + ఈశ్వర = నరేశ్వర.

ఆ) 'ఉ, ఊ' లకు మరియు 'ఓ' అక్షరానికి గుణసంధిగతమైన "ఓ" తో యతి:

- ఉత్తమకీర్తులైన మనుజోత్తము (భాగవతం 1-80) - మనుజ + ఉత్తము = మనుజోత్తము.
- ఊహల సౌధమందు వికచోత్పల (కల్పితం) - వికచ + ఉత్పల = వికచోత్పల.
- ఓపిక లేక చచ్చిన మహోరగముం గొని (భాగవతం 1-501) - మహా + ఉరగముం = మహోరగముం.

ఇ) 'ఋ' కు సంధిగతమైన "అర్" తో యతి: (ఇక్కడ గుణం అకారమైనా రేఫ అదనంగా జోడించబడుతుంది)

- ఋతువులలోన నెన్న శిశిరర్తువు (కల్పితం) - శిశిర + ఋతువు = శిశిరర్తువు.
- ఋషివర! లోకసన్నుత మహర్షివి నీవు (కల్పితం) - మహా + ఋషివి = మహర్షివి.

(ౠ, , క్ష అక్షరాలకు ప్రయోగ ఉదాహరణలు అలభ్యము)

2. వృద్ధిసంధి (అష్టాధ్యాయి 6.1.88)

అ, ఆ లకు ఏ, ఐ లు పరమైనప్పుడు ఐకారము; ఓ, ఔ లు పరమైనప్పుడు ఔకారము ఏకాదేశమౌతాయి.

1. స్వరయతి: 'అ, ఆ, ఐ, ఔ' లకు ఆదేశ వర్ణాలు కాని సాధారణ ఐ, ఔ లతో యతి చేస్తే స్వరయతి అవుతుంది. (అనగా అ, ఆ, ఐ, ఔ లకు పరస్పరం యతి చెల్లడం).
2. స్వరప్రధానయతి: 'ఇ, ఈ, ఏ' లకు వృద్ధి ఆదేశంతో వచ్చిన 'ఐ' తోనూ; 'ఉ, ఊ, ఓ' లకు వృద్ధి ఆదేశంతో వచ్చిన 'ఔ' తోనూ యతి చేస్తే స్వరప్రధానయతి అవుతుంది.
3. వృద్ధియతి: 'అ, ఆ, ఐ, ఔ' లకు వృద్ధి ఆదేశంతో వచ్చిన ఐ, ఔ లతో యతి చేస్తే వృద్ధియతి అవుతుంది.
4. పాదాదిలో వృద్ధి ఆదేశంతో వచ్చిన ఐ, ఔ లు ఉన్నప్పుడు వాటికి 'అ, ఆ, ఐ, ఔ' లతో యతి చేయవచ్చు.

సులభంగా చెప్పాలంటే: వృద్ధిసంధి వలన వచ్చిన 'ఐ, ఔ' లు పాదాదిలో ఉన్నా, యతి స్థానంలో ఉన్నా:

- 'ఐ' కి - 'అ, ఆ, ఇ, ఈ, ఎ, ఏ, ఐ' లతో,
- 'ఔ' కి - 'అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ లతో యతి చెల్లుతుంది.

ఉదాహరణలు:

1. స్వరయతి:

- ఆతతాయింజైత్ర - ఐంద్ర మిత్ర (అప్పకవి) - 'ఆ' కు 'ఐ' తో యతి.
- ఐందవప్రగోత్ర - ఔర్వశేయస్తోత్ర (అప్పకవి) - 'ఐ' కు 'ఔ' తో యతి.

2. స్వరప్రధానయతి:

- 2.1 వృద్ధి అక్షరం పాదాదియందు:
  - ♦ క్రోధైక ధురీణతన్ గఱచి - ఏసిన... (మనుచరిత్ర 3-90) - క్రోధ + ఏక లోని 'ఏ' కు 'ఏ' తో యతి.
  - ♦ లంకౌకస్ సంచయ కాళరాత్రి గళ బద్ధోదగ్ర... (భాస్కర

రామాయణం సుందరకాండ 448) - లంక + ఒకన్ లోని 'ఓ' కి, బద్ధ + ఉదగ్ర లోని 'ఉ' కి యతి.

- 2.2 వృద్ధి అక్షరం యతిస్థానమందు:
  - ఇతడు మృదుభాషి సతతశాంతైక మూర్తి (కల్పితం) - 'ఇ' కి 'శాంత + ఏక' లోని 'ఏ' తో యతి.
  - ఎవ్వాని నిత్యదానైక విలాసంబు (పారిజాతాపహరణం 1-12) - 'ఎ' కి 'దాన + ఏక' లోని 'ఏ'తో యతి.
  - అత్యున్నతిఁ గ్రొవ్వి త్రుళ్లరు బిడౌజ... (ప్రభావతీప్రద్యుమ్నము 1-95) - అతి + ఉన్నతి లోని 'ఉ' కి, బిడ + ఓజ లోని 'ఓ' తో యతి.
  - ఓ యతీశ్వర కొనుమ శుద్ధౌదనంబు (కల్పితం) - 'ఓ' కి 'శుద్ధ + ఓదనంబు' లోని 'ఓ' తో యతి.

3. వృద్ధియతి:

- అతులిత దేవరాజ్యభరణైక... (వసుచరిత్ర 5-28) - 'అ' కి 'భరణ + ఏక' = భరణైక లోని 'ఐ' తో యతి.
- అతడు మహానుభావుడు శివైక్యము జెందిన రాజయోగి (కల్పితం) - 'అ' కి 'శివ + ఐక్యము' = శివైక్యము లోని 'ఐ' తో యతి.
- ఆకలి దీర్ప నీకు మధురౌదనమింతయు పెట్టజాల (కల్పితం) - 'ఆ' కి 'మధుర + ఓదన' = మధురౌదన లోని 'ఔ' తో యతి.
- ఆతడు దత్తపుత్రుడు నిజౌరస పుత్రుడ నేను (కల్పితం) - 'ఆ' కి 'నిజ + ఔరస' = నిజౌరస లోని 'ఔ' తో యతి.
- మహౌషధరాజమిద్ది విమలాశయులారా! (కల్పితం) - 'మహా + ఔషధ' = మహౌషధ లోని 'ఔ' కి, 'విమల + ఆశయులార' లోని 'ఆ' తో యతి.

ఇలాగే ఇతర ఉదాహరణలను ఊహించవలయును. (సశేషం)

## ప్రహేళిక

పూర్వకాలంలో కవులు ఏదైనా సభలో లేదా ఒకరిని ఆశీర్వదించాలన్నా కొన్ని చమత్కారమైన శ్లోకాలలో రెండర్థాలు కలవాటితో ప్రశంసించే వారు. అలాంటి ఒక శ్లోకం చూద్దాము.

శ్లో॥ అనేకానన సంఛేత్తీ - హరినందనసూదనః ।
ధరాత్మజాపతిః పాయాత్ రాజచూడామణిస్సవః ॥

ఇది శ్రీపరమేశ్వరుని పరంగా, శ్రీరాముని పరంగా రెండు అర్థాలు కనబడతాయి. **శివునిపరంగా:** అనేకాననః = చాలాముఖములు(4) గల బ్రహ్మదేవుని ముఖం; సంఛేత్తీ = సంహరించినవాడు; హరినందనః = మన్మథుని; సూదనః = సంహరించినవాడు; ధరాత్మజాపతిః = హిమవంతుని కూతురైన పార్వతీదేవికి భర్త; రాజచూడామణిః = రాజచంద్రుని శిరోభూషణంగా ధరించినవాడు; సహ = పరమేశ్వరుడు; వః = మిమ్ములను; పాయాత్ = రక్షించుగాక.

అలాగే **శ్రీరామునిపరంగా:** అనేకాననః = రావణాసురుని (దశగ్రీవుడు కదా); సంఛేత్తీ = సంహరించినవాడు; హరినందన = ఇంద్రుని కుమారుడైన వాలిని; సూదనః = సంహరించిన వాడు; ధరాత్మజాపతిః = భూదేవి కూతురైన సీతాదేవికి భర్త; రాజచూడామణిః = రాజులలో చూడామణివంటివాడైన; సః = ఆ శ్రీరామచంద్రస్వామి; వః = మిమ్ములను; పాయాత్ = రక్షించుగాక.

ఇలా రెండర్థాలు లేదా మూడర్థాలు గల శ్లోకాలు సాహిత్య చరిత్రలో మన కవులు కల్పించి రసానందాన్ని ఆత్మానందాన్ని కలిగించుచూ మనకు అందించినారు.

**- 'అవధాని' ముత్యంపేట గౌరీశంకర శర్మ**

## కొప్పరపు కవులు - సమస్యాపూరణం

ఓ అవధానంలో కొప్పరపు కవుల కీయబడిన "తల్లిమగండు తండ్రియని తల్పక కూడియు సాధ్వియయ్యెగా" అనే సమస్యను ఈ విధంగా పూరించారు.

తల్లిధరిత్రి సీతకు యథార్థము శ్రీహరి యా ధరిత్రికిన్
వల్లభుడయ్యె, నా హరియు వర్ణితలీలను రాముఁడయ్యె నా
హల్లకపాణి సీత విభుడై తగురాముని యోగ్య వేళలన్
తల్లిమగండు తండ్రియని తల్పక కూడియు సాధ్వియయ్యెగా

- కొప్పరపు సోదర కవుల కవిత్వము (3వ పద్యము), పుట 46)

**భావము:** ఇది సీతారాముల చిత్ర ప్రసక్తి విశేషం - సీతమహాసాధ్వి - భూదేవి సీతకు తల్లి. ఇది సర్వజన విదితమే. విష్ణుమూర్తి భూదేవికి భర్త కాబట్టి సీతకు విష్ణువు తండ్రి అవుతాడు. శ్రీహరియే రాముడుగా అవతరించాడు కదా! ఆ భావాన్ని గుర్తించక సీత యోగ్య కాలములందు తల్లికి మగడు తండ్రి అని అనుకోక ఆయనను కూడెను. ఆమె మహాసాధ్వీమణి అయ్యింది. ఇది వింత వర్ణన.

ఇందులో పారమార్థిక విశేషాలున్నాయి. **'రాఘవత్వే భవత్సీతా రుక్మిణీ కృష్ణ జన్మని; విష్ణోరేషాన పాయినీ'** అని లక్ష్మిని గూర్చిన విశేషజ్ఞానాన్ని మనం దృష్టిలో నుంచుకోవటం ముఖ్యం.

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

వరుఁడా కృష్ణుఁ డటంచు రుక్మిణి గడున్ వైముఖ్యముం జూపెనే

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, కడప**

ఉరు కీర్తిన్ గల కృష్ణునిన్ వలచి తా నుత్సాహమే మీరగన్
గురు తేజోనిధి కృష్ణుడే యనుచు సంకోచంబు లేకుండగన్
దరుణీరత్నము చేదిరాజు కుములన్ దైన్యంబు చేకూర్చ, నా
వరుఁడా కృష్ణుఁడటంచు,రుక్మిణి గడున్ వైముఖ్యమున్ జూపెడిన్

**పి.యల్.నాగేశ్వరరావు, హైదరాబాదు**

తరుణోపాయముఁ జూప విప్రుడటఁ, జింతన్ వీడి వైదర్భి తాఁ
ద్వరితంబున్ గుడి చెంతనిల్వ హరియే ప్రాప్తింప నుప్పొంగెడిన్
వరుడా కృష్ణుడటంచు., రుక్మిణి గడున్ వైముఖ్యముం జూపెడిన్
ధర నా చైద్యుని పెండ్లియాడుటకు నిర్ద్వంద్వంబుగానత్తఱిన్!

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాద్**

నిరతమ్మున్ హృదయమ్మునన్ తలచుచున్ నీరేరుహాక్షుండు శ్రీ
హరినిన్ చిత్తములోన నగ్రజునిదౌ యావేశమున్ గాంచుచున్
వరదుండైన మురారి యాగమనమున్ భద్రమ్ముగా నుంచగా
వరుడా కృష్ణ డటంచు రుక్మిణి గడున్ వైముఖ్యముం జూపెడిన్

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

సరసాహ్లాదము జెందువేళ మదిలో స్వాంతంబు చేకూరగన్
తరుణీ చింతన వైభవాదులను తాదాత్మ్యంబు మైదూలె, నా
వరుడా కృష్ణుడటంచు రుక్మిణి, గడున్ వైముఖ్యముం జూపెడిన్
వరుడై చేదిమహీపతి ప్రబల హృద్వాంఛల్ ఫలింపంగనే!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

వరుఁడా కృష్ణుడటంచు, రుక్మిణి గడున్ వైముఖ్యముం జూపెడిన్
గరపన్ బెండిలి చేదిరాజు తన నాకాంక్షించ నామోదమై
స్థిరమున్ జేసితిమంచుఁ బెద్దలటు, విశ్లేషించి సందేశమున్
ద్వరితమ్మొంది పరిగ్రహించు విధి గోపాలుండు పంపెన్ వడిన్

**డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాదు**

సరిగా నెన్నితి వాసుదేవు పతిగా శౌరిన్ మహాత్మున్ తగన్
వరియింపన్ గనునో ననున్? సుమతితో ప్రాజ్ఞుండటంచున్ మదిన్?!
నిరతమ్మున్ భువి విర్రవీగు ధణులన్ నేర్పున్ గనన్ ద్రోచెనో?
వరుడా కృష్ణుడటంచు రుక్మిణి! గడున్ వైముఖ్యమున్ జూపెడిన్

**రాకుమార, గోదావరిఖని**

తరుణీలోలుడు కంసహంతకుడు భూతప్రేతమాయావియౌ
వరుడాకృష్ణుడటంచు రుక్మిణి గడున్ వైముఖ్యముం జూపెడిన్
తెఱగున్ రుక్మి సభాముఖంబునను నిందింపన్ ముహూర్తంబునన్,
మురళీమోహను చెంతకున్ తరలె సమ్మోహంపు సద్భక్తినిన్.

## దత్తపది

'అల – కల – తల – వల' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ సనాతన ధర్మ ప్రాశస్త్యంపై చంపకమాల

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

అలము సనాతనమ్మగు శుభాన్విత ధర్మము హృద్యమై సదా
కలహము శూన్యమై చన వికారము నాశము శాంతి మోదమై
తలఁపుల దైవ చింతనయు ధర్మవిచక్షణ సద్గుణమ్ములన్
వలచి జనాళి భవ్య సుఖప్రాప్తిని ముక్తినిఁ బొంద నేర్వరే

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాద్**

అలసట యన్నదే కనక యద్భుత రీతిని మౌని పుంగవుల్
కలమును బట్టి శాస్త్రముల క్రమ సనాతన ధర్మమెంచుచున్
తలచుచు భావి కాలమును తద్దయు ప్రీతిని వ్రాసి మించిరే
వలపు ఘటిల్ల కట్టడి నవారితమౌ గతి నిల్ప మేలగున్.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, కడప**

అలఘు పురాణసారమగు నార్యుల ధర్మము నిత్య సత్యమై
కలదె జగాన నిట్టిది ప్రకాశితమై తగనొప్పు ధర్మమే!
తలచ లభించు ముక్తియు సధాత్రిని నెల్లరు నమ్మి, దానినే
వలయు ననంగ వృద్ధిగొని వైభవమొందు సనాతనమ్మనై!

**డా. రఘుపతి శాస్త్రుల, హైదరాబాదు**

అలసట లేని రీతుల మహాత్ములు తీర్చిన ధర్మమేసదా
కలతలు లేని భంగి శుభ కామితముల్ కననట్లు చేయుచున్
తలపుల నిల్చి యుండును సదా యిది సత్యము, నమ్ము వారి కా
వల సమకూరు సంపద లవారిత రీతుల వృద్ధి నందగన్.

**రాకుమార, గోదావరిఖని**

అలకువ లేని నిష్ఠతను హాయి నొసంగు సనాతనంబునన్
కలవరమెంచబోవని సుఖంబును గూర్చు ననంతరీతులున్
తలపున గల్గు ధార్మిక విధాయక మర్మము వెల్లడించగన్
వలమురితాలుపే నిలిచి పంచెను గాదె సహస్రనామముల్.

సమస్య: మక్షికమొండు నోర్తెరచి మత్తగజంబును మ్రింగె నాఁకటన్
దత్తపది: 'పిల్లి–కుక్క–బల్లి–ఉడుత' పై పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ బిచ్చగాడి దీనస్థితిని తెలుపుతూ స్వేచ్ఛాఛందంలో పద్యం వ్రాయండి.
(పూరణలు 15 అక్టోబరు 2026 లోపు 7702121376 ఫోన్ నంబరుకు పంపాలి)

# పద్యపరిమళం

**- అన్నమరాజు ప్రభాకరరావు**

## పద్యశిల్పవైశిష్ట్యం

**సీ.** శ్రీ మిథిలానాథు జేరిన పుణ్యఫ
లంబు వామాంక మలంకరింప,
అంజనాదేవి మున్నార్జించిన తపఃఫ
లంబు మెల్లన చరణంబులొత్త,
కైకేయి గడియింప గల్గిన నోము ఫ
లంబు చెయ్యెత్తి ఛత్రంబు పట్ట,
ఘన సుమిత్రా భాగ్యకల్పకార్జిత తపః
ఫలములు వింజామరలను వీవ,
**తే.గీ.** ఫలములకు నెల్ల ఫలమైన భవ్యయోగి
నళిన హృదయాసనంబున నిలచి నిండు
సభను రాణించునట్టి కౌసల్య నోము
ఫలము దలచెదన్ నా తపఃఫలము గాగ ॥

ఇది యొక విశిష్టమైన పద్య శిల్పము. సాధారణంగా గొప్ప వ్యక్తులను వారివారి నామాలతోనో, బిరుదాలతోనో లేదా వారికైన విశిష్ట లక్షణాలతోనో సంబోధించడమో, ప్రస్తావించడమో జరుగుతుంది. ఇక్కడ ఆ విధంగా కాక శ్రీరామునితో అనుబంధ మున్నట్టి కొంతమంది మహానుభావులను పేర్కొని దలచిన కవి వారి వారి తల్లిదండ్రులను, ప్రధానంగా వారికి జన్మనిచ్చిన మాతృమూర్తులను ప్రస్తావించి వారిని పాఠకులు తప్పనిసరిగా స్మరించే విధంగా ఈ పద్య రచన చేసినాడు.

ఈ పద్యంలో నిండు సభలో కొలువు తీరిన శ్రీరామచంద్ర చక్రవర్తిని వర్ణిస్తున్నాడు కవి. ఒక చిన్న పద్యంలో చెప్పదగిన విషయానికి అతి దీర్ఘమైన సీసపద్యాన్ని ఎంచుకొని ఆద్యంతమూ రసభరితము చేసి, వర్ణన అంటే ఇలా కదా ఉండాలి అన్నట్లు పద్యరచన చేసినాడు.

పద్యము యొక్క అర్థము సుగ్రాహ్యమే అయినా – మిథిలా పురాధీశ్వరుడు, రాజర్షి అయిన జనక మహారాజు చేసికొన్న పుణ్యఫలము అయిన సీతామాత వామాంకము మీద ఆసీనురాలై యున్నది. అంజనాదేవి ఆర్జించిన తపః ఫలమైనటువంటి ఆంజనేయ స్వామి మెల్లగ పాదములొత్తుచున్నాడు. *కైకేయి గడియించిన నోము ఫలముగ జన్మించిన భరతుడు ఛత్రము పట్టుకొని సింహాసనానికి వెనుక భాగాన నిలబడి యున్నాడు, **శ్రేష్ఠురాలైన సుమిత్రాదేవి తపః ఫలములైన లక్ష్మణ శత్రుఘ్నులు ఇరువైపులా నిలబడి వింజామరలు వీచుచున్నారు.

ఈ చెప్పబడిన పుణ్యఫలాలు, తపఃఫలాలు, నోముఫలాలు, ఇంకా ఏవైనా ఫలాలు ఉంటే ఆ ఫలాలన్నిటి ఫలితమై, యోగి పుంగవుల హృదయపద్మాసీనుడై (యోగిహృద్ధ్యానగమ్యం) నిండు సభలో విరాజిల్లుతున్నట్టి కౌసల్య నోము ఫలమైన శ్రీరామచంద్ర మూర్తిని నా తపస్సుకు ఫలితముగా తలచి సేవించెదను గాక.

*మామూలుగా వ్యక్తులనే ప్రస్తావి స్తున్నట్లైతే భరతుడిని చెబితే సరిపోయేది. తల్లుల ప్రస్తావన తెచ్చినందువల్ల భరతుడిని స్ఫురింపజేయటానికి కైకేయిని చెప్పవలసి వచ్చింది. కైకేయి మీద జనబాహుళ్యంలో ఉన్న అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసికొన్నట్లైతే ఇంతటి ఉన్నతమైన వ్యక్తుల మధ్యన ఆమె పేరు చెప్పకూడదు. అయినా చెప్పబడింది. అంటే మనకు తెలియని కైకేయిని తెలుసుకోమంటున్నాడు కవి.

**శ్రేష్ఠురాలైన సుమిత్రాదేవి అంటున్నాడు. పైగా సుమిత్రా దేవిని **"కల్పకము"** అంటున్నాడు అంటే కోరిన కోర్కెలను తీర్చేది. కోరకున్నా కూడా భావాన్ని బట్టి అనుగ్రహించేది కల్పవృక్షం. అట్టిది సుమిత్రాదేవి. ఈమె తపస్సు (లక్ష్మణ శత్రుఘ్నుల రూపంలో) రెండుచెల్లో ఫలించింది. లక్ష్మణుడు రాముని యెడ ఎంత భక్తి తత్పరత గలవాడో తెలిసిన విషయమే. కానీ రాముని వెంట లక్ష్మణుని వనవాసానికి పంపుతూ సుమిత్రాదేవి లక్ష్మణునికి చెప్పిన మాటలు ఒక్కసారి మననం చేసికొన్నట్లైతే ఆమె గొప్పతనం మనకు అర్థమవుతుంది. వాగ్దానానికి ఫలితంగా ఎలా అయినా అడవికి వెళ్ళవలసిన, వెళుతున్న రాముడిని చూసి కౌసల్య దుఃఖించింది. అనవసరంగా అడవికి వెళుతున్న లక్ష్మణుడికి సుమిత్ర జాగ్రత్తలే చెప్పింది కానీ దుఃఖించలేదు. అదీ ఆమె తపః ఫలము. అందువలన ఆమె "కల్పకము"

ఈ విషయాలన్నీ లోతుగా యెఱిగిన పండితుడైన విద్వాన్ బ్రహ్మశ్రీ కల్లూరి సుబ్రహ్మణ్య దీక్షితులు గారు వ్రాసిన పద్యమిది.

(9వ పేజీ తరువాయి) **కవితల వేల్పు గిడ్డి...**

**ఉప్పు కడలియన్న నుపయోగమే లేదు**
**మంచినీరు లేక మనిషిలేడు**
**తృష్ణ తీర్చుగాక కృష్ణమ్మ జలధార...** ఇంతవరకు సాధారణంగానే సాగిన పద్యంలో చివరిపాదం **"అరవకుండుగాక అరవజాతి"** అనడంతో మెఱుపు వచ్చింది. అది శ్రీరామారెడ్డిగారి ప్రత్యేకత.

శ్రీనరాల రామారెడ్డిగారు నహిప్రతి యన్నట్లు దాదాపు యాభై ఏండ్లు వేల నాలుగు చెరగులా అవధానాలు చేసి పండితుల, పామరుల హృదయాలు దోచుకొన్నారు.

# కవి కల్పలత - 4

నిఘంటు సిద్ధమైన పదాలతో కవిత్వమల్లే వెసులుబాటు అవధానికి అన్ని సందర్భాలలో ఉండదు. ప్రాశ్నికులు సంధించిన ప్రశ్నకు ప్రతియోగిగా కోరిన ఛందస్సులో ఇమిడి పోవుటకు సరిపడే కొలతలు గల పదాలను అవధాని సృష్టించుకోవాలి. ఆ సృష్టి అప్పటికప్పుడు గట్టు చేర్చడానికే అయినప్పటికీ కావ్యవ్యాకరణాదులకు విరుద్ధంగా ఉండరాదు. కాబట్టి ఆయా మర్యాదలను అనుసరించి పదసృష్టి చేయాలి. ఇదివరకు దేవేశ్వర మహాకవి భోజ్యభోజకాది సంబంధము వల్ల పదసృష్టిక్రమాన్ని తెలియజేశారు. అటుపై పతిపత్నీత్వ సంబంధము ద్వారా పదాలను సృజించుకొనే విధానాన్ని తెలిజజేస్తున్నారు.




పతివాచకము (నామము) మీద కాంతా పర్యాయపదాలు చేరితే పత్నీ నామాలు తయారవుతాయి. శివుని భార్య పార్వతి, విష్ణువు భార్య లక్ష్మి కదా! శివ నామం మీద 'కాంతా' పర్యాయ పదాలు అనగా శివకాంతా, శివదయితా, శివవధూః, శివప్రణయినీ, శివప్రియా, శివాంగనా, శివరమణీ మొదలగు పదములు పార్వతి అన్న అర్థాన్ని తెలియజేస్తాయి. శివునికి ఇల్లాలైనది పార్వతి అన్నది అర్థం –'శివ' శబ్ద స్థానంలో తత్పర్యాయాలైన హర, శంకర, మృడ, భర్గ, శర్వ, ఈశ్వర మొదలగు పదాలను చేర్చుకొని పరశ్శత పార్వతీ నామాలను సృజించుకొనవచ్చును. శివ పర్యాయములు స్థానంలో విష్ణు పర్యాయ వాచకాలను చేర్చినచో అవి లక్ష్మీదేవి నామములగుచున్నవి. ఇట్లే వాణీ హిరణ్యగర్భులు మొదలగు జంటలను చేర్చుకొనవచ్చును. అసక్తిగలవారు ఒక పర్యాయం విడివిడిగా ఆనామాలను వ్రాసి సరిచూసుకొన వచ్చును. ఇవి అన్నియూ స్త్రీలింగాలని, సమాస నిర్మాణంలో తుది దీర్ఘాన్ని హ్రస్వం చేయరాదని గుర్తుంచుకోవాలి.

ఇదే విధంగా గౌరీ నామ పర్యాయ వాచకములు అనగా పత్నీ వాచకముల మీద ప్రణయి, ధవః, ప్రియ, రమణ, ప్రాణేశ్వర, ఈశ మొదలగు పదాలు చేరితే శివ నామాలు తయారవుతాయి. గౌరధవ, గౌరీప్రియ, గౌరీరమణ, గౌరీశ, గౌరీవల్లభ, గౌరీప్రాణేశ, గౌరీప్రాణనాయక, గౌరీనాయక, గౌరీ మనోహర, గౌరీప్రాణేశ్వర మొదలగునవి శివ పర్యాయములు. గౌరీ పర్యాయ వాచకాలైన ఉమా, శివా, కాళీ, కాత్యాయనీ, చండీ, ఆర్యా, దుర్గా, గిరిజా మొదలగు వానితో శివనామాలు; లక్ష్మీ, కమలా, పద్మా, ఇందిరా, రమా, మా, భార్గవి మొదలగు లక్ష్మీవాచకాలతో విష్ణునామాలను సృజించుకొనవచ్చును. ఆయా పర్యాయపదాలకు అమరకోశము ఆధారగ్రంథం కాగలదు. ఈ పర్యాయ వాచకసృష్టి తెలిసిన అవధానికి క్లిష్టతరమైన ఛందో నియమాలు కేళీవిలాసంగా మారుతాయి.

స్నేహితుని పర్యాయ పదాలతో సృష్టించే క్రమంలో రూఢిని పరిగణనలోకి తీసుకోవాలి. ఉదాహరణకు 'శ్రీకంఠసఖ' అన్న పదానికి కుబేరుడన్న అర్థం రూఢమైయున్నది. కానీ 'కుబేర సఖ' అంటే శివుడన్న అర్థం రూఢం కాదు. దీన్ని గుర్తించి ప్రయోగించా లని దేవేశ్వరకవి సూచన. వాహన వాహ్య సంబంధముతో కూడా నామవాచకములను సృజించుకొనవచ్చును. ఉదాహరణకు వృషయాన, వృషాశ్వ, వృషారూఢ, వృషవాహన మొదలగునవి శివ పర్యాయములగును. దేవతలలో వేరొకరికి ఎవరికైనా వృషభవాహనం ఉన్నా వారికి ఈ పదాలు వాడరాదు. వృషభవాహనం శివునికని రూఢి ఉన్నది. ఇట్లే గరుడవాహ, గరుడాశ్వ, గరుడారూఢ, గరుడయాన, గరుడవాహన ఇత్యాదులు విష్ణునామములగును. ముందే తెలియ జేసినట్లు వృష పర్యాయ వాచకాలైన వృషభ, ఉక్ష, సౌరభేయ మొదలగు వాటితో శివపర్యాయపదాలు; గరుడ తార్క్ష్య, వైనతేయ, సుపర్ణ, గరుత్మాన్ మొదలగు వాటితో విష్ణు పర్యాయ వాచకాలు తయారు చేసుకొనవచ్చును. గరుత్మంతుడు పక్షులకు రాజు. ఈ అర్థంతో పక్షివాచకాలైన విహగ, ద్విజ, ఖగ, పతగ, నీడోద్భవ, నీడజ, విహంగ, శకుని, పతగ ఇత్యాదులపై పతి పర్యాయములైన, పతి, ప, ధవ, భర్త, నాథ, ఈశ్వర, ఈశ మొదలగు వాటిని చేర్చుట ద్వారా పరశ్శత గరుడ వాచకాలను సృజించవచ్చును. ఈ అర్థంలోనే విష్ణు సహస్రనామాలు సమకూర్చవచ్చును.

దేవేశ్వరకవి ఆశ్రయ సంబంధము ద్వారా నామములను కల్పించుకొను ఉపాయమును గూర్చి తెలియజేస్తూ – ఆశ్రయము అనగా నివాసము, ఉదాహరణకు స్వర్గ, వైకుంఠ మొదలగు వాటిపై చేరిన సదన, సద్మాన, సద, వాసిన మొదలగు పదములు అక్కడ నివసించువారిని గూర్చి తెలియజేస్తాయని అన్నారు. ఉదాహరణను ద్యుసదన, ద్యుసద్మాన, దివౌకస, ద్యుసద, ద్యుశయా మొదలగు పదాలు దేవతలనే అర్థాన్ని తెలియజేస్తాయి. వీటిపై పతి పర్యాయపదాలు చేరిస్తే దేవేంద్ర వాచకాలవుతాయి. కానీ 'భూసద్మాన' మొదలగు పదాలకు

రూఢిలేని కారణం చేత మనుష్యులనే అర్థం రాదు. అందువల్ల ఆ అర్థంలో ఆ పదాలను ప్రయోగించరాదు.

మనం ఇదివరకే చెప్పుకొన్నట్లు, వృషవాహన (శివుడు) అన్న పదంలో వృషమునకు శివునకు వాహ్యవాహక సంబంధము వివక్షింపబడినది. వృషాంక అనునప్పుడు ధార్య ధారక భావ సంబంధము వివక్షింపబడినది. వృషపతి అని అన్నప్పుడు స్వస్వామి భావ సంబంధము వివక్షింపబడును. ఈ వివక్షను అనుసరించి ఉచితములైన పదాలను మాత్రమే ప్రయోగించాలి. సర్పమునకు నెమలి విరోధి అన్నప్పుడు 'అహిరిపు' అని, సర్పమును నెమలి తింటున్నదన్నప్పుడు 'అహిభుక్" అని ప్రయోగించాలి. ఈ ఔచిత్యము కవులు పద ప్రయోగములందు పాటించవలెనని దేవేశ్వర కవి సూచించారు.

## తటిల్లతలు

**డా. ఆశావాది ప్రకాశరావు అవధానాలనుంచి...**

**ప్రశ్న:** మా భోజనం ఏర్పాట్లు ఎలాగున్నాయి?

**సమాధానం:** అపాత్రంగా నిష్ఫలంగా ఉనాయి.

**ప్ర:** మీరు శ్రీనాథునిలా తప్పు పడుతున్నారు.

**స:** అబ్బే. అదేం లేదండి. విస్తర్లలో వడ్డించి అపాత్రం చేశారు. ఒక్క పండైనా ఇవ్వకపోవటంతో నిష్ఫలమైంది.

**ప్ర:** హాస్పిటల్సులో రోగి ఆరోగ్యంపై డాక్టరు ప్రభావమా? నర్స్ ప్రభావమా? ఏది ఎక్కువ ఉంటుంది?

**స:** నర్సు వచ్చినప్పుడు మాత్రం కాస్త కళ్ళు తెరుస్తూ ఉండటం, ఆమె చూచేటప్పుడు మాత్రమే ఆ బీపీ పెరగటం జరుగుతున్న దృష్ట్యా ఎవరి ప్రభావం ఎక్కువగా ఉంటుందో మీరే ఊహించుకోండి.

**ప్ర:** కోతికి నాతికి భేదం?

**స:** కోతి చంచలం, నాతి చలచ్చలం.

**ప్ర:** మా పాఠశాల ఒక పాత కట్టడం. ఆకతాయి కుర్రాడు మిద్దెపైకి వెళ్ళే మెట్లపై కూర్చొని ఉంటాడు. వాళ్ళను వదిలించే ఉపాయం చెప్పండి.

**స:** వాళ్ళు కూర్చొను చోట మెట్లు పడును జాగ్రత్త అని ఒక బోర్డ్ పెట్టండి. వాళ్ళు తప్పుకుంటారు. (రాయలసీమలో మెట్లు అంటే చెప్పులు అని అర్థం)

**ప్ర:** కోతిగాడంటూ తిడితూనే కొందరు కోతిని పూజిస్తా రెందుకు?

**స:** కోతి గాడ్ అనే నమ్మకంతోనే లెండి.

**ప్ర:** సమాజంలో సంపన్నులు ఎవరు?

**స:** సం పన్. చక్కని వాక్ చమత్కారముటచూపే మీలాంటి వాళ్ళు, సం (కొంత) పన్ను కట్టే మన ముఖ్య అతిథి లాంటి వాళ్ళు. సం ( కొన్ని మాత్రమే) పన్నులు గల నేటి నిషేధాక్షరి పృచ్ఛకులులాంటివాళ్ళు. ఇలా సంపన్నులు నాలుగు రకాలు.

**ప్ర:** ఆరోగ్యం యావత్తు పోతే ఇక దిక్కెవరు?

**స:** ఆరోగ్య పదం యావత్తు పోతే ఆరోగం మిగులుతుంది. ఆరోగః అంటే సూర్యుడు. ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అన్నరు కాబట్టి ఆయనే దిక్కు.

**ప్ర:** పాలు కరుచుకొని తాగితే మేలా? ఎత్తుకొని తాగితే మేలా?

**స:** మధురాహారంబులు గొనుట తగదొక్కనికిన్ అంటుంది భారతం. కాబట్టి పంచుకొని త్రాగితే మంచిది.

**ప్ర:** ఒంటరిగా ఉన్నప్పుడు?

**స:** బహుశా మీకు కరుచుకొని త్రాగటం, ఎత్తుకొని త్రాగటం ఇష్టంగా ఉన్నట్టుంది. కాని నందాంగనా డింభకుడైన గోపాలుడు తన పాలివారందరికి పాలు పంచినట్లు భాగవతం సాక్ష్యమిస్తోంది.

## మ న వి

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

**- సంపాదకులు**

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

## వాక్యదోషాలు

భిన్నవృత్తం, యతిభ్రష్టం, విసంధి అని వాక్యదోషాలు మూడు. ఇవి కావ్యాలంకారసూత్ర వృత్తిలో వామనుడు ప్రతిపాదించిన వాక్యదోషాలు. వీటిలోని మొదటి రెండు దోషాలు ఛందస్సుకు సంబంధించినవి. విసంధి వ్యాకరణానికి సంబంధించినది. ఛందోవ్యాకరణాలు సాహిత్యానికి మూలశాస్త్రాలు కాబట్టి ఆ రెండింటికీ కావ్యదోషాలుగానే పరిగణనం.

**భిన్నవృత్తం:**

'లక్షణచ్యుతవృత్తం భిన్నవృత్తమ్' అని భిన్నవృత్తలక్షణం. తన లక్షణం నుండి తప్పిన వృత్తం భిన్నవృత్తదోషజుష్టం. ఇక్కడ వృత్తవదం గణప్రధానాలైన వృత్తాలతో పాటు మాత్రాప్రధానాలయిన ఛందస్సులకు కూడా వర్తిస్తుంది. వామనుడు భిన్నవృత్తానికి ఉదాహరణంగా వైతాళీయాన్ని చూపించాడు. వైతాళీయం మాత్రాచ్ఛందస్సు. కాబట్టి వృత్తమైనా, జాతి గీత్యాదులైనా తమ లక్షణానికి దూరమైతే అక్కడ భిన్నవృత్తదోషమున్నట్లే. అయితే ఇది క్వాచిత్కంగా జరిగే పొరబాటే కానీ అజ్ఞానకృతమైన దోషంగా కనిపించదు.




ఉదా: **నాకు వ్యసనికినట్టి దినములు వచ్చెఁ**
**గొన్ని కొన్ని రాగల వికఁ గొన్ని కొన్ని పోయె**

(బాలరామాయణము)

ఇది శ్రీ వేదాల తిరువేంగళాచార్యులుగారు తమ కావ్యాలంకార సూత్రవృత్తి అనువాదంలో చూపిన ఉదాహరణం. ఇది తేటగీతి. ద్వితీయ పాదంలో అక్షరాలు ఎక్కువయ్యాయి. పద్యంలో ఒకటి రెండు అక్షరాలు ఎక్కువో తక్కువో కావటం, వెంటనే ఎవరో ఒకరి సూచనతో దానిని సవరించుకోవటం అనేక సందర్భాలలో కనిపిస్తుంది. వీటిలో ప్రామాదికాలే ఎక్కువ. తేటగీతి పద్యంలో ఒక ఆటవెలది పాదం కలిసిపోవటం, ఆటవెలదిలో తేటగీతి చోటు చేసుకోవటం ఇటువంటివే.

ఇవిగాక ఆయా ఛందస్సులలో విధింపబడిన గణాలు కాక ఇతర గణాలు ప్రవేశించటమో, నిషిద్ధగణాలు చొరబడటమో జరగవచ్చు. అలాంటివి ప్రామాదికాలూ కావచ్చు, అజ్ఞానకృతాలూ కావచ్చు.

కందంలో విషమస్థానాలలో జగణం నిషిద్ధం. ఆరవ గణంగా జగణ, నలలలో అన్యతరం విహితం. ఇది తెలియకనో, గుర్తులేకనో పొరపాటు జరగవచ్చు.

ఉదా: **కవితా శక్తికి నసంత**
**భవితవ్యత గలదుగాన భావకులు కవుల్**
**సవనముగాఁ గని దానిని**
**వ్యవహారమందు నిరతము వర్తింపదగున్**

ఈ పద్యంలో పూర్వోత్తరార్ధాలలో 3వ గణం, 5వ గణం జగణాలయ్యాయి. ఇది కందపద్య లక్షణానికి విరుద్ధం.

అలాగే సీసపద్యంలో ప్రతిపాదానికి విధింపబడిన మొదటి ఆరు గణాలలో (ఇంద్రగణాలు – నల నగ సల భ ర త) ఇతర గణాలు కూడా పొరపాటున ప్రవేశిస్తుంటాయి. ఈ దోషం కూడా పొరపాటు అయినా కావచ్చు అజ్ఞానకృత మైనా కావచ్చు.

సంస్కృతంలో ఇంద్రవజ్ర (తతజగగ), ఉపేంద్రవజ్ర (జతజగగ) పాదాలను పద్యంలో యథేచ్ఛగా కలుపుతారు. ఆ పద్యాలను ఉపజాతులు అంటారు. ప్రథమాక్షరంలోని గురులఘుభేదం తప్ప మిగిలిన పద్యలక్షణ మంతా రెండింటికీ సమానం కావటంతో ఆ రెండింటిని అలా కలిపారు. అలాగే తెలుగులో శార్దూలపద్య పాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా విడగొడితే మత్తేభం అవుతుంది. ఉత్పలమాల పాదంలోని మొదటి గురువును రెండు లఘువులుగా మార్చితే చంపకమాల అవుతుంది. అయితే మత్తేభ, శార్దూల పద్యాలనో, ఉత్పలమాలాచంపకమాలలనో ఉపజాతులలాగా కలపటానికి కొంత ఇబ్బంది ఉంటుంది. అది అక్షర సంఖ్యలోని మార్పు. ప్రాస నియమం.

**యతిభ్రష్టం:** 'విరసవిరామం యతిభ్రష్టమ్' అని యతిభ్రష్ట లక్షణం. చెవికింపుగా అనిపించని విరుపు యతిభ్రష్టమని దాని అర్థం. సంస్కృతంలో యతి అంటే విచ్ఛేదమే. నియత స్థానంలో పదం విరిగిపోవటం లేదా ముగిసిపోవటం సంస్కృతంలో యతి పేరుతో వ్యవహరింపబడుతుంది. ఆయా స్థానాలలో విరుపునకు అనుగుణంగా పదభంగం జరగకపోతే అది వినటానికి అసౌకర్యంగా ఉంటుంది. ఏకపదమైనా ఉపసర్గధాతువుల మధ్య విరిగినా పృథక్కుగా వుండే ప్రకృతిప్రత్యయాల మధ్య విరిగినా సర్దుకుంటారు సంస్కృత లాక్షణికులు. ధాతువు మధ్యనో, పదం మధ్యనో విరుపు రావటాన్ని అసలు అంగీకరించరు.

తెలుగుచ్ఛందస్సులో ఆ సమస్యలేదు. నన్నయ్యతోనే మొదలైందో, అంతకుముందే శాసనాలలోని ప్రయోగాలను బట్టి నన్నయ్యకు ముందే అటువంటి నిర్ణయం జరిగిందో స్పష్టంగా చెప్పలేము కాని తెలుగు వాళ్ళు యతి స్వరూపాన్నీ, నియమాలనూ పూర్తిగా వేరు చేసుకున్నారు సంస్కృతం నుండీ. యతి అనగా మొదటి అక్షరం. ఆ అక్షరంతో మైత్రి పొందదగిన అక్షరం యతిమైత్రి స్థానంలో ఉండాలి. అది తెలుగుచ్ఛందస్సులోని యతి. వినసొంపుగా ఉండటం దీని ప్రాథమిక స్వరూపమైనా ఆ తర్వాత అనేక వికారాలకు లోనైంది తెలుగు యతి, అసలు లక్షణాన్ని విస్మరించేంతగా. పులుసుకు, పులుసులోని ముక్కలకు యతి వేస్తానంటాడు. వినికిడి వేరు కదా అని ప్రశ్నిస్తే గొలుసుకట్టు కారణాలను చెప్తాడు. లాక్షణికులు పోటీలుపడి యతుల సంఖ్యను పెంచే ప్రయత్నం చేయటమూ, కవులు కూడా సరిపెట్టే ప్రయత్నాలతో సాగుచేయటంతో యతిపంట తెలుగులో పుష్కలం.

అయినా యతిమైత్రి కుదరకపోతే అది యతిభ్రష్టం. ఈ లోపం కూడా రెండు విధాలుగా ఉంటుంది. నిర్దిష్ట స్థానంలో యతిమైత్రి లేకపోవటం, లేదా కుదరని అక్షరంతో యతిమైత్రిని కూర్చటం.

మత్తేభశార్దూల పద్యాలలో కవులలో ఈ తడబాటు కనిపిస్తుంది. నిర్దిష్ట స్థానంలో యతిమైత్రి లేకపోవటం. అలాగే రెండు మూడు యతిమైత్రి గల స్థానాలలో, యతి సంయుక్తాక్షరమైనపుడు యతిమైత్రిని కూర్చటంలో, ప్రాసయతిని కూర్చటంలో తడబడే అవకాశముంటుంది. పదస్వరూపాన్ని సరిగా అర్థం చేసుకోక పోయినా యతిమైత్రిని కూర్చటంలో పొరపాటు జరుగుతుంది.

ఉదా: జెగజెట్టి నృసింహరాయ శేఖరుఁ డొసఁ గున్

– శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి

ఇక్కడ వాస్తవానికి పదం జగజెట్టి కానీ జెగజెట్టి కాదు. దాని ఎత్వసహితంగా పొరబడినందువల్ల జె కి యతిమైత్రిగా శే వాడబడింది. ఇది యతిభ్రష్టదోషం.

మరొక ఉదాహరణ –

కమ్మకస్తురి చెక్కులఁ గరఁగి జాఱ
జన్నుగవ మీఁది పైయద చంగలింప
నడుగు దమ్ములు మిక్కిలి తడబడంగ
నరిగె లోనింటి కడలుచు నలరుబోఁడి

మైరావణ చరిత్ర 1–160

ఇది మాదయకవి ప్రయోగం. 'చెంగలించు' పదాన్ని 'చంగలించు'గా కవి భావించినందువల్ల చకార జ(చ)కారాలకు యతిమైత్రిని కూర్చినాడు. ఇక్కడ వ్యాకరణ పరిష్కారం చేస్తే యతిభ్రష్టత. కవి స్వేచ్ఛను కాదనరాదనుకుంటే వ్యాకరణభ్రష్టత.

సంస్కృతచ్ఛందస్సులలో ప్రాసనియమం లేదు కాబట్టి ప్రాసభ్రష్టతను యతిభ్రష్టతతో పాటు దోషంగా పరిగణించలేదు. తెలుగులో ప్రాసనియమం ఉంది కాబట్టి యతిభంగంలాగా ప్రాసభంగమూ దోషమే. ప్రాసనియమాలను భంగపరచటం లేదా భంగం కలగటం ప్రాసభ్రష్టమని మనం నిర్వచించుకోవాలి.

ఉదా:

ప్రత్యక్షంబున నుండి యెల్లప్రజలన్ బాలించుచున్నప్డు సం
రక్షింపం గొనియాడినాము గద స్వర్గస్థాత్రియై కంటిచే
వీక్షింపంబడరానిదై...

– తిరుపతి వేంకటకవులు – విక్టోరియా మహారాణి ప్రశంస.

ఇక్కడ ప్రథమపాదంలో 'త్య' ఇతర పాదాలలో 'క్ష' ప్రాసగా కనబడుతోంది. కాబట్టి ప్రాసభంగం. అయితే ఇది ప్రామాదికం. ప్రథమపాదంలోని తొలిపదం ప్రత్యక్ష కాబట్టి 'క్ష'తోనే – ప్రాసగా – పద్యాన్ని ప్రారంభించామేమో అన్న భ్రాంతిమూలకస్మృతి మనస్సులో ముద్రింపబడటం వలన ఇతర పాదాలను 'క్ష' ప్రాసతోనే చెప్పటం జరిగింది. ఇంతకుముందే చెప్పినట్లు యతిప్రాసభ్రష్టాల్లో పొరపాట్లే ఎక్కువ ఉంటాయి, పాండిత్యరాహిత్యం కన్న.

సులక్షణసారము (లింగమగుంట తిమ్మకవికృతము) వావిళ్ళ రామస్వామిశాస్త్రులు & సన్స్ వారిచే 1920లోనూ, 1955లోనూ ముద్రింపబడింది. ప్రాసకు సంబంధించి 1920 ప్రతిలో లేని విషయాలు 1955 ప్రతిలో విద్యాన్ శ్రీ రావూరి దొరస్వామిశర్మచే చేర్చబడినవి.

"లళలు, ఋరలు, నణలు, రఱలు, లడలు, దధలు, థధలు పరస్పరము ప్రాసమైత్రినందును"

– సులక్షణసారము (1955) 133వ పుట.

వీటిలో లళలు, ఋరలు, నణలు లాక్షణికులు చెప్పినవే. రఱల మైత్రి అప్పకవ్యాదులచే నిరసింపబడినది. దధలకు థధలకు ప్రాసమైత్రిని కూర్చే విషయంలో ఆధునికులలో విచిత్రాభిప్రాయా లున్నాయి. ఒకపాదంలో మాత్రమే ఈ దధల భేదముండవచ్చునీ, మూడుపాదాలలో సమాక్షరమే ఉండాలనీ వ్యవహరిస్తున్నారు. అదొక ముచ్చట అంతే. సులక్షణసారం అటువంటివి చెప్పిందో లేదో తెలియదు. దొరస్వామిశర్మగారు దధ; థధల ప్రాసను సూచించినారు. ప్రయోగాలను చూచి ఆధునికులు అలా అర్థం చేసుకున్నారు.

అప్పకవి 'స్వవర్గజప్రాస' పేర థ ధకారాలకు ప్రాసను ప్రతిపాదించాడు. కవిత్రయ భారతం నుండి, ఆముక్తమాల్యద

(మిగతా 23వ పేజీలో)

# సంస్కృతం-సంస్కృతి 13

**నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ**

గత సంచికలో సంస్కృతసాహిత్యములో పూర్వకవులు అనేకానేక ప్రయోగాలు, సామాజిక స్పృహ, లోకసామాన్యానికి ఉపయుక్తమైన అనేక సూక్తులు అవి అనుకరించకుండా, అనుసరిస్తే అవధానపద్యాల సొగసు పెరుగుతుంది అని చూసాం కదా. ఇక ఈ సంచికలో ఇలాంటి మరికొన్ని విశేషాలు అంశాలు తెలుసుకుందాం.

అవధానికి ప్రశ్నలు ఎలాంటివి వస్తాయి అన్నది చెప్పలేము. ప్రాశ్నికులు భిన్న మనస్కులు కదా. వారి అనుభవము, పఠనశీలత, ఇతరత్రా జ్ఞానము, వాటి స్థాయీభేదములు, ప్రశ్నవేయునప్పుడు వారి ఉద్దేశం ఏమిటి ఇత్యాది అనేకాంశలు వారి ప్రశ్నని నిర్దేశిస్తాయి. అలాగని, ఇది కుదరదు ప్రశ్న వేరేది వేయండీ అని అడగలేరు కదా. అంటే విస్తృతాధ్యయనం అవశ్యం చేసి తీరాల్సిందే. ఉదాహరణకి ఈ మధ్య ఒక శతావధానములో పరా, పశ్యంతీ మధ్యమా, వైఖరీ అని నాలుగు పదాలు దత్తపదిలో ఇచ్చారు. ఇవి అన్యార్థములోకి విరుపు కుదరని పదాలు. కనుక అవధాని తప్పక వాటిని స్వార్థములోనే వినియోగించాలి. ఈ పదాలు పరిశీలించినట్లైతే ఇవి వాక్కుయొక్క ఉత్పత్తికి సంబంధించినవి. అవధానికి ఈ విషయముపై కనీస అవగాహన లేకపోతే ఎలాంటి మానసిక స్థితి కలుగుతుందో ఊహించవచ్చు. సంచాలకులు ప్రేక్షకులకు ఉపయుక్తం అన్నట్లు ఆ పదాలపై వ్యాఖ్యానించవచ్చు కానీ సంచాలకులకు కూడా ఒకవేళ అవగాహన లేకున్నప్పుడు ఎలా? సరే ఏదో పూరిస్తారు కానీ, అది జనామోదము, ప్రాశ్నికామోదము కాకపోవచ్చు. తదుపరి పద్యాలన్నీ అద్భుతమైనా కూడా ఈ ఒక్కపద్యమే చర్చనీయాంశమై అవధాన విజయాన్ని నిర్ణయిస్తుంది అన్నది అవధానులకు అనుభవమే కదా.

ఇక సంస్కృత మహాకావ్యాలలో నిక్షిప్తమైయున్న జ్ఞానరాశి గురించి కొంచెం చూద్దాం. ప్రధానముగా ధర్మము, వాటి స్వరూపస్వభావాలు ఉండి తీరుతాయి. ధర్మము అంటే ఎట్టి పరిస్థితులలోనూ విడిచిపెట్టక ధరించి ఉంచాల్సినది. ఇవి పలురకాలు. ధర్మము, సామాన్యధర్మములు,విశేష ధర్మములు, ధర్మసూక్ష్మములు ఇలా అనేకం. ప్రాశ్నికుడు ఇందులో ఏదైనా దృష్టిలో ఉంచుకుని అడగవచ్చు. అంటే అవధాని ఒకవిధముగా ప్రాశ్నికునిలోకి పరకాయప్రవేశము చేయగలగాలన్న మాట. అలాగే సాధనా మార్గాలు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైతమనే ప్రధాన సిద్ధాంతాలు స్పృశించి అడుగవచ్చు. వాటి స్వరూప స్వభావాలు కనీసావగాహన ఉండాలి కదా.

ధర్మప్రాధాన్యం, ఆధ్యాత్మికీ భావన, పారలౌకికీ భావన, సదాచారపాలనము, వర్ణవ్యవస్థ, ఆశ్రమ వ్యవస్థ, కర్మవాదము, పునర్జన్మ వాదము, మోక్షము,శ్రుతుల యొక్క ప్రావీణ్యము, యజ్ఞము యొక్క మాహాత్మ్యము, సత్యపరిపాలనము, అహింసా పాలనము, త్యాగము యొక్క మాహాత్మ్యము, తపోమయజీవనము, మాతృపితృగురు భక్తి- భారతీయసంస్కృతిలో చాలా ముఖ్యమైన అంశాలు.

గమనించాల్సిన విషయమేమిటంటే ప్రాచీన సంస్కృత కవులు వీటిని కథారూపములో నిక్షిప్తము చేసి సులభగ్రాహ్యముగా బోధించినారు. మరొక విశేషమేమిటంటే సాహిత్యములోని పాత్రల పేర్లు సాధారణముగా ఆ పాత్రలక్షణాన్ని సూచించేవిగా ఉంటాయి. ఇక నాటకాదులలో సంభాషణాత్మకముగా జనసామాన్యానికి చేరువైన భాషలో ఆయా పాత్రల ద్వారా పలికించడం గమనించవచ్చు. ఇలా సాహిత్య ప్రక్రియ ఏదైనా లోకోపకారమైనవే అయి ఉండుట, పైన చెప్పుకున్న ముఖ్యాంశాల విశదీకరణ గమనించవచ్చు.

మనకి పెద్దలు నిర్దేశించిన సంస్కృత పంచకావ్యాలు భాషాధ్యయనమునకే కదా. శబ్దాధికారము, అలంకారములు, సంధివిశేషాలు, వంటివి భాషాపరమైన సౌష్టవాన్ని కలగచేస్తే, భావపరమైన విస్తృతజ్ఞానాన్ని లోకధర్మాలను అలాగే లెక్కలేనన్ని లోకోక్తులు కూడా లభ్యమౌతాయి. పద్యసాహిత్యములో అన్నీ ఛందోనియమాలకు అనుగుణముగా ఉండుట, తెలుగు ఛందస్సులు ప్రధానమైనవి సంస్కృతలక్షణాలనే యతి ప్రాస నియమాలను చేర్చి స్వీకరించినవే కనుక పద్యములలోని లోకోక్తులు అవధాని హాయిగా తన పద్యములలో స్వీకరించవచ్చు కూడా. అది అనుకరణ కాదు, అనుసరణ మాత్రమే. కారణం లోకోక్తులు సార్వాకాలీనములు, సార్వజనీనములు కనుక. వాటిని అవధాని తన భావానికి అనుగుణముగా వాడుకొనవచ్చు.

ఇక కావ్యం అంటే ఏమిటి? ఏవి చదవాలి అన్నది చూద్దాం. కావ్యాలను రెండుగా విభజించారు ఆలంకారికులు. అవి దృశ్యకావ్యము, శ్రవ్య కావ్యము అని. దృశ్యకావ్యములో మనకి భరత,ధనంజయాదులు చేసిన దశరూపకములున్నవి. శ్రవ్యకావ్యాలలో మళ్ళీ గద్య, పద్యకావ్యాలని రెండు రకాలుగా విభజించారు. గద్య కావ్యాలలో కథ, ఆఖ్యాయిత (తన కథ తానే చెప్పుకోవడం), వృత్తగంధి, చూర్ణిక, ఉత్కలికాప్రాయం అని, అలాగే పద్యములో మహాకావ్యం, ఖండకావ్యము, చంపూకావ్యము అని

## ఈనెల అంశం: గృహలక్ష్మి

**శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ, హైదరాబాద్**

ఉ. వచ్చెను శ్రావణమ్ము వరభాసిత భూషణ శోభలెన్నియో
తెచ్చెను మాలలల్లుకొని తీయని కమ్ర సుగంధరాగమై
విచ్చిన మోదమందు తలపించు నవోద్ధత నూత్నరోచిలో
మెచ్చగ నెచ్చెలింబగిది మేల్గృహలక్ష్మి పవిత్ర శ్రామమై!

తే.గీ. అలర ద్వారాన తోరణాలల్లి రిచట
వరలె బంగారు కాంతులన్ వైభవంబు
దివ్యమంగళరూప ప్రదీప్త లెగయ
రమ్యమై నిల్చె గృహలక్ష్మి శ్రావణమున!

తే.గీ. మొగలిపూవులు సంపంగి ముద్దబంతి
పొన్నలున్ బారిజాతాలు పొగడపూలు
జతగ గన్నేరు తామరల్ శంఖుపూల
నమరె గృహలక్ష్మి లోగిళ్లు హరువునింపి!

తే.గీ. ఇహము పరమందు సౌభాగ్య రహిని యెంచి
గరిమ ముదితలు శ్రావణగౌరి నిల్పి
ముదము తోడుత వరలక్ష్మి బూజ జేయ
బరగు గృహలక్ష్మి శ్రీదేవి వరము లంది!

ఉ. ఆకస మేఘమాలికలు హర్షపు వర్షపు ధారలీయగన్
వీక గొనున్నదా విభవవిస్తృతి మేదినినందు జీవమై
ప్రాకటమై చెలంగి ఋతురాగమహోత్సవ సంభ్రమప్రభన్
జేకొని కర్షకాళి వలచెన్ గృహలక్ష్మిని సంతసమ్మునన్!

**పి.యల్.నాగేశ్వరరావు, హైదరాబాదు**

**గృహలక్ష్మి శ్రావణ లక్ష్మిని ఆహ్వానించుట**

ఉ. శ్రావణ లక్ష్మివీవె! వర లక్ష్మియు నీవెగ తల్లి శాంకరీ!
కావుమ నీదు బిడ్డలను, గంగను ముగ్నితిమమ్మ మేమిలన్!
జీవనసౌఖ్యముం గనము! ఛిద్రము లాయెను జీవితమ్ములున్!
బావని! దుష్టశక్తులదె పాలన, ద్రుంచుమ దుర్మదాంధులన్!

చ. తొలకరి లేక రైతులకు తోషమదెంతయు శూన్యమయ్యెడిన్!
జలకళ లేని నిర్ఝరులు, సాగుకు నోచని బీడుభూములున్,
ఫలితము లేని పాలనయు, పల్లెలఁ బండుగ శోభ లేమియున్,
కలహపు బంధువర్గములు, కాంతి విహీనపు కాపురమ్ములున్!

చ. కలగను భాగ్యరేఖనిడి క్రాంతులు నింప సమాజమందునన్
లలిత మనోజ్ఞరాలివయి రమ్మిటు మాకిల శోకమార్పగన్!
బలువిధ పూజలన్ సలిపి భక్తిని గొల్తుము నిన్నునమ్మరో!
కలుషితమైన మానవుల కష్టము లెల్లను బాపరాగదే !!

## ఖండ-శర్కర

**నిర్వహణ: శతావధాని డా. ఎం.వి. పట్వర్ధన్**
**శతావధాని చేపూరి శ్రీరామ్**

**గృహలక్ష్మి**

సీ. కాయకష్టము చేసి కాపురమ్మును గాచి,
మగనితోడుగ నిల్చి మ్రానువోలె,
నత్త మామలఁ జూచి, యతిథులఁ బ్రేమించి,
కన్నబిడ్డల సాకి గారవముగ,
నాడ పడచులతో నారళ్లఁ జీవాట్లు,
నారోగ్యచిక్కుల నధిగమింపఁ
దగినసొమ్ము కరవై తల్లడిల్లుచునుండఁ
'దనవారు' సైతము తప్పుకొంద్రు!!

తే.గీ. నేటి 'గృహలక్ష్మి' యారీతిఁ బాటుపడగఁ
దాళిగట్టిన మగడైన దరికిరాక
తోడపుట్టిన వారలున్ దోడులేక
బ్రతుకు బండిని లాగుచు చితికిపోయె!

తే.గీ. తనకుఁ జేదోడుగానిల్చి తనదు మగడు
వెన్నుదట్టుచు నడయాడఁ బ్రేమతోడఁ
జెక్కుచెదరని ధైర్యము చెంతనిలువ
సంద్రమైననీదు నబల సబలగాను !!

**డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్.**

ఉ. ఇంటికి దీపమై వెలిగి హృద్యముగా తమ 'వారి' కెప్పుడ
న్నింటను తోడు నీడగ అనేక విధంబుల నుండు 'రామ'! మి
న్నంటెడు భాగ్యసీమకు ననంత మహోన్నత పుణ్య రాశికిన్
కంటికి రెప్పగా నలరు 'కాంత'కు క్రాంతికి సాటిలేదిలన్

ఉ. ఒంటికి నిండుగా నమరు నుత్తమరీతుల వస్త్ర ధారణన్
కంటికి నింపుగా నలర గాంచెడు నా పరదేవతా సతీ!
మింటిని వెల్గులం జిదిమి మేదినికిన్ దిగివచ్చి నట్లు వం
టింటిని ఇంటియందును మహిన్ గను లక్ష్మికి సాటిలేదిలన్

చ. గృహమును స్వర్గ సీమగ జిగీష నొనర్చెడు అంగనామణుల్
సహనము కోలుపోవక విచక్షణతో తమ జీవనమ్ములో

**తదుపరి అంశం**

**దుర్గాభర్గ మార్గప్రియా!**

మకుటముతో 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది 15 అక్టోబరు 2026

నహమిక తోడ వృత్తుల నయమ్ము జయమ్మును నందజూడ ని
మ్మహి యశమొందగా గనుట మాన్యతయౌ నవజీవనమ్మునన్

చ. వినుతమునైన జీవనపు వృద్ధికి మూలపు సీమ నందరున్
మనుచు మహోన్నతమ్మగు ప్రమాణములన్ మది నెంచి తీర్చగా
ననవరతమ్మునెంచిన మహత్వ పటుత్వ ఫలమ్ములందగా
గననగు, గౌరవింపవలె కల్మి నొసంగిన స్థానమున్ తగన్

చ. నవ హిత జీవనమ్మున అనంతమగున్ సుఖ దుఃఖజాలముల్
ప్రవిమల మైన రీతుల నిరంతరమున్ జయ దీక్ష నెంచుచున్
స్తవములనందు జీవన వివర్ధన శీలురు భావి నెంచి యే
తెవులుల నంద కుండగ సుదీప్తి కుటీరము తీర్చ మేలగున్

**అసనారె, హైదరాబాద్**

ఉ. పుట్టిన వాసమున్ విడిచి, మోదము తోడుట చేరి యిచ్చుతో
మెట్టిన యింటికిన్, గనుచు మిక్కిలి యర్మిలి నత్తమామలన్,
బెట్టుగ భర్తఁ గన్గొనుచు ప్రేమను బంచుచు చిత్తశుద్ధితో
గుట్టుగ సంసృతిన్ నడుపు కోమలి త్యాగము నెంచ సాధ్యమే

చ. అనయము మెట్టినింటికయి యగ్గలమౌ కృషి చేసి మించుచున్
వినయముతోడ మిత్రులను విందుల గాంచుచు మంచి పెంచుచున్
పెనకువతోడ కార్యముల వేవురు మెచ్చగ నాచరించుచున్
తనపతి పోడిమిన్ బెనిచు తన్వి నిజమ్ముగ దేవతే కదా!

చ. స్తుతమతి తోడ శ్రీహరికి స్తోత్రము జేయుచు దీక్షతోడుతన్
పతికనువౌ విధమ్మునను వంటలు చేయుచు కల్పవృక్షమై
రతివలె పాన్పుపైన కడు రంజిలజేయుచు రాత్రివేళలన్
సుతుల కుమార్తెలన్ గరము శోభిల జేయును పెంపకమ్ముతో

చ. తగు సలహాల నిచ్చుచు నుదారముగా గణియించి లాభమున్
పగలును రాత్రియున్ బని నవారితమౌ గతి చేయుచుండెడిన్
తగవగురీతి సంసృతి సదానడిపించుచు నుండు బ్రీతితో
జగతి జనించు దేవతగ సన్నుతి నొందు గృహంపు రాణియై

చ. నిరతము నింటి భారమును నిర్మల చిత్తము తోడ మోయుచున్
స్థిరమగు వృద్ధి పొందగను చేయు శ్రమమ్ము కరమ్ము ప్రజ్ఞతో
వరగుణ యుక్తమై మెలగి ప్రాభవమున్ గొని తెచ్చు నింటికిన్
ధరణిని పుట్టినట్టి ఘన దైవమె పత్ని గణించ సత్యమున్

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

మధ్యాక్కర
మనుజుని బ్రదుకున వరలు మానినులిర్వురు మహినిఁ
దనరుచుఁ బథముఁ గరపఁగఁ దల్లి బాల్యమునఁ దదుపరి
తనువున సగముగ నిలచి తలఁపుల వలపుల నింపి
మనుఁగడ సుగమముఁ జేసి మధురిమనిడు గృహలక్ష్మి

తోటకము ఇహమొప్పను ముక్తికి నింతి సదా
సహనమ్మున ధాత్రిగ సఖ్యతతో
బహు కార్యములందున బాసటయౌ
గృహలక్ష్మియె భాగ్యము గేహికిలన్

మంగళమహాశ్రీ
కర్తగ వికీర్ణ గృహకార్యముల బాధ్యతలఁ గాంచు, వరమై పరఁగుతోడై
స్ఫూర్తిఁగని సంతునటు పూన్చి సరిదిద్దఁ బరిపూర్ణ కృషిసల్పుఁ, గొమరాలై
భర్తను సదామధుర భావనలఁ దేల్చెదు సుభాషిణియగున్, జెలిమి మీరన్
వర్తిలి సదా ముదిత భాసిలు, కుటుంబపు వ్యవస్థ గృహలక్ష్మిభృతి నిల్పున్

మ.కో. అత్తమామల నాదరించుచు, హాయిఁ గూర్చెడు సాధ్వియై,
విత్తమందెడు కొల్వుఁ జేయుచుఁ, పిల్లవాండ్రకు నేత్రమై
చిత్తమందున నిల్పి పెంచుచు, శ్రేయమొందఁగ మూలమౌ,
పుత్తడిన్ గృహలక్ష్మి నెప్పుడు భూరి ప్రేమనుఁ గాంచుమా!

చ. అలిగిన సత్యభామనటు లక్కునఁ గృష్ణుఁడు చేర్చినట్టులన్
గులసతి కంటనీరిడుచుఁ గ్రుంగని రీతినిఁ జూడ నెంచుమా!
పొలఁతుక దుఃఖ మొందఁగను బోఁడిమి యింటను బొంద శక్యమే!
ఇల గృహలక్ష్మి భాగ్యమని యెంతయొ యుక్తిగ నాదరించుమా!

**రాకుమార, గోదావరిఖని.**

ఆ.వె. పరిజనంబుతోడ మరియాదనుసలిపి
కలుపుగోలుచెలిమి కరముసాచి
పుట్టినింటిపరువు మెట్టినింటనుజేర్చి
గరిమమునగను కులగౌరవమును.

ఆ.వె కలిమిలేమియందు కలవరమొందక
సామరస్యగుణము సర్దుకొనగ
మంచిమాటలాడి మదినిశాంతపరిచి
సహననేర్పుకూర్చు గృహమునందు.

ఆ.వె. అత్తమామలయెడ నభిమానముప్పొంగ
చిరునగవులసిరిని సేవజేసి
తనదుసంతుకెల్ల సంస్కారమొనరించి
ఇచ్ఛగనుమసలెడిఇంటివెలుగు.

ఆ.వె. జననియగుచును సహజన్మరాళ్ళగుచును
దైవమొసగిన సహధర్మిణగుచు
బహుముఖమ్ముతోడ శహబాసునమెరసి
సేమమునగను సుఖజీవనమును.

ఆ.వె. కళలహృదినియున్న గర్వంబునెఱుగక
కరుణ ప్రేమలందు తరుగుబోక
సత్యవర్తనమున నిత్యపూజలజేయు
పాపమెఱుగనిస్వరూపరాణి.

### శ్రీనివాస్ లింగం

కం. అలసిసొలసి నట్టి మగడు
మలిసంధ్యన గూడుచేరఁ,మాటలతో చే
తలతో శాంతిని బంచుచు,
కలతను దీర్చు గృహలక్ష్మి కాదె వరమహో

మ.కో. ఇంటి ముంగిట పాడి పంటగ, హెచ్చు తగ్గుల నెంచకన్,
బంటు కైనను రాజు కైనను ప్రాణమౌ గృహలక్ష్మియే
కంటి పాపకు కన్నురెప్పగ కష్ట మందున నిల్చులే
చంటి పాపకు రామరక్షగ శక్తియౌ గృహలక్ష్మియే

తే.గీ. వేల ఎకరమ్ములేలరా! వేయి గదుల
ఇల్లు లేల భువిని! మన వల్లకాని
లక్షలాస్తు లేల! సతము కక్షలేని
లక్షణమగు చక్కని గృహలక్ష్మిచాలు!

తే.గీ. కలువకు అజుని వెన్నెల వెలుగు ఓలె
కమలమునకు భానుని యొక్క కాంతిభంగి
భ్రమరమునకు పుష్పించిన సుమము రీతి
పతికి గృహలక్ష్మి కాదె అవనిని జోడి॥

మంజుభాషిణీ ఇహలోకమందు చవినిచ్చి, నిత్యమున్
సహియించి తప్పులను శాంతమూర్తియై
గృహలక్ష్మిబెంచు పతికీర్తినిన్, ముదా
వహమిద్ది!ధాత్రిపయి భాగ్యజీవహో!

## మేడసాని మోహన్‌గారి అష్టావధానం

(11వ పేజీ తరువాయి)

3) అవధాని గారూ...మీరు నాన్‌స్టాప్‌ఫ్లైటు లో వచ్చారు కదా, మరి ఎల్లా దిగారండీ?

సమాధానం : నాన్‌స్టాప్‌విమానంలో వచ్చాను కాబట్టే అవధానం కూడా నాన్‌స్టాప్‌గా చేయడం జరుగుతోంది. మీ అప్రస్తుతం కూడా నాన్‌స్టాప్‌గానే సాగుతోంది..!

4) అవధానం చేస్తే ఎన్ని కాలరీలు కరుగుతాయో చెప్పండి?

సమాధానం: అవధానం చేస్తే ఉన్న శక్తి పోదు, కొత్త శక్తి వస్తుంది.

5) పెళ్ళి ఉప్మాకి అంతరుచి ఎల్లా వస్తుందండీ?

సమాధానం : అది మీ అభి రుచిని బట్టి వుంటుందిలెండి..

6) వెంకటేశ్వరుడు కటి వరద హస్తాలతోనే కనిపిస్తాడు, అభయ హస్తం వుండదు ఎందుచేత?

సమాధానం : మీకు అభయ హస్తం కావాలంటే అప్పలాయగూడు వెళ్ళండి.

(20వ పేజీ తరువాయి) **సంస్కృతం - సంస్కృతి**

విభజించారు.

మహాకావ్యాలలో కాళిదాస రచనలైన రఘువంశము, కుమారసంభవము, భారవి వ్రాసిన కిరాతార్జునీయము, మాఘుడు వ్రాసిన శిశుపాలవధము, శ్రీహర్షుడు వ్రాసిన నైషధీయచరితము కలిపి పంచమహాకావ్యాలు అంటారు. అలాగే అశ్వఘోషుడు, బాణభట్టు, దండి, సుబంధుడు, ధనపాలుడు, ఆనందధరుడు, సోడ్ఢలుడు, వాదీభసింహుడు, విద్యాచక్రవర్తి, అగస్త్యుడు, వామనుడు, తిరుమలాచార్యుడు, తిమ్మకవి, అహోబిలనృసింహుడు, అంబికాదత్తవ్యాసుడు ఇత్యాది అనేకులు సంస్కృత సాహిత్యాన్ని పరిపుష్టము చేసారు.

ఇక కాలానుగతముగా అధ్యయనము చేసినప్పుడు అవధానికి సాహిత్యప్రస్థానములో భాషావరమైన మార్పులు, శబ్దప్రయోగవిషయములో విశేషాలు, వాక్య, పద్య నిర్మాణశైలి, శయ్య ఇత్యాదులన్నీ అవగతమౌతాయి. కనుక ఒక ఉత్తమమైన అవధానిగా, సాధికారిక సద్యోపద్యనిర్మాణమునకు ఉపయుక్తమైన అనేకానేక అంశాలు ఈ గ్రంథాలలో పుష్కలముగా లభిస్తాయి. అంతే కాదు, మన దేశ సంస్కృతి, సామాజిక, రాజకీయ, నైతిక, ధార్మిక విషయాల సమాహారముగా దర్శనమిస్తాయి.

కనుక అవధాని తన అధ్యయనప్రణాళికలో భాగముగా ఇట్టి గ్రంథసంపదను పరిశీలించి, ఆకళింపు చేసుకున్నప్పుడు ఏదో అవధానపద్యాలు వ్రాసినారనిపించుకోకుండా గొప్ప పద్యనిర్మాణము చేసిన అవధానిగా ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకోగలరు. ఇక ఈ కవుల రచనలోని పరమాన్నములో జీడిపప్పుల్లాంటి కొన్ని అంశాలను తదుపరి సంచికలలో చూద్దాము. **(సశేషం)**

(19వ పేజీ తరువాయి) **కావ్యదోషాలు**

నుండి ప్రయోగాలను చూపించాడు. అలాగే దధలకు కూడా పూర్వకవి ప్రయోగాలను బట్టి ప్రాసమైత్రిని నిర్దేశించాడు. అప్పకవి చూపిన ఉదాహరణ పద్యాలలో ఆ భిన్నాక్షర ప్రయోగం ఒక పాదంలోనే ఉన్నందువల్ల దానిని లక్షణంగా భావించారు ఆధునికులు. అందుకే పైన చెప్పిన నిర్ణయం. అయితే అది సరికాదు. వందపైసలు ఒక రూపాయి అని చెప్పినపుడు, పైస ఎలా ఉంటుందంటే ఒక పైస చూపిస్తే చాలు, వందపైసలూ చూపవలసిన అవసరం లేదు. లక్షణోదాహరణల విషయంలోనూ అదే న్యాయం.

కాబట్టి థధ, దధల ప్రాసను యథేచ్ఛగా వాడవచ్చు. అది కావ్యదోషం కాదు.

# పద్యపరిమళం

## ఎందుకింత భయం?

కవులకు లోకంపట్ల పరిపూర్ణ మైన అవగాహన ఉంటుంది. లోకవృత్త పరిజ్ఞానం ఆధారంగా చక్కనిచమత్కారాలు చేయగలరు.

కోయిలలు చిగురుటాకులను తింటాయి. తుమ్మెదలు పూల తేనెను ఆస్వాదిస్తాయి. విచ్చిన పూవులను వింటిలో సంధించి మన్మథుడు తన బాణాలుగా ప్రయోగిస్తాడు. వింజామరల చల్లని గాలులు పద్మవనమంతటికీ ఆహ్లాదం కలిగిస్తాయి. ఇది ఒక అంశం. కావ్యనాయికలు విరహ వేదన పడుతున్నప్పుడు చెలికత్తెలు రకరకాల శీతలోపచారాలు చేస్తారు. చిగురాకుల పాన్పు అమర్చి, పూలతేనెలు ఆస్వాదింపచేసి, సుకుమారమైన కలువపూవులను కన్నులకు అద్ది, చల్లని వింజామర గాలులతో సేదతేర్చి, ఉపశమనం కలిగించే ప్రయత్నం చేస్తారు. ఇది వేరొక అంశం. విరహంతో వేగిపోయే నాయికకు ఈ శీతలోపచారాల వల్ల ఉపశమనం కలుగదు సరికదా! తాపం మరింతగా పెరిగిపోతుంది. ఇది మరో అంశం. ఈ మూడు అంశాలనూ ముచ్చటగా ముడి వేసి "రాజశేఖర చరిత్ర" కావ్యకర్త 'మాదయగారి మల్లన'కవి అద్భుత చమత్కారం సృష్టించాడు.

ఆ కావ్యంలో నాయిక కాంతిమతి. ప్రియుడికోసం విరహంతో బాధపడుతోంది. చెలికత్తెలు శీతలోపచారాలు చేశారు. నాయికకు ఉపశమనం కలుగకపోగా తాపం రెట్టింపు అయ్యింది.

చెలికత్తెలు "ఇదేమిటమ్మా! విడ్డూరం?" అని పరిహాసా లాడుతున్నారు. అని మల్లనకవి మధురమైన పద్యంలో చమత్కరించాడు. చెలికత్తెలు ఏమంటున్నారో చూద్దాం.

"ఓ భామా! చిగురుటాకులను చూసి అంతగా హడలిపోతున్నా వెందుకు? అవేమైనా కత్తులా? అవి కత్తులే అయితే ఈ పాటికి గండుకోయిలనోరు తెగిపోయి ఉండేది కదా! – ఓ వనితా! పూలతేనెను హాయిగా ఆస్వాదించక, అంతగా భయంతో శోషిల్లి పోతున్నావేమిటే? – అదేమైనా సలసల కాగే నీరా? పూదేనెలే మరుగుతున్న ద్రవమైతే, ఈ పాటికి గండుతుమ్మెద ముక్కు కమిలిపోయి ఉండేది కదా! – ఓ వెలదీ! అరవిరిసిన పూలను చూసి అలా భయంతో తెల్లపోతున్నా వెందుకే? అవేమైనా కణకణ మండే నిప్పులా? అవే నిప్పుకణికలైతే ఈ పాటికి ఆ మన్మథుడి అరచేయి పొక్కిపోయి ఉండదా? – ఓ పొలతీ! చల్లని వింజామర గాలులకు అలా బెదిరి దూరంగా పోతున్నావెందుకే? అవి వడగాడ్పులా ఏమిటి? అవే వడగాలులైతే ఈ పద్మవనం ఎప్పుడో అట్టుడికి పోయి ఉండేది కదా! – వెర్రిదానా! శీతలోపచారాలకు భయపడతా వేమిటే?" అంటున్నారు ఆ చెలికత్తెలు.

సీసపద్యంలోని నాలుగు పాదాలనూ వరుసగా తేటగీతి నాలుగు పాదాలతో సమన్వయిస్తూ కవి చూపిన పద్యనిర్మాణ శిల్ప రచనా ప్రతిభ అసాధారణం. పద్య సౌందర్యం అమోఘం. పద్యం –

చిగురాకులే కత్తు లగునేని నింతకు
దగర కోయిల నోరు తెగక యున్నె?
అలరు తేనియ వేడి యగునేని నింతకు
గండుతుమ్మెదముక్కు కమలకున్నె?
అరవిరులే నిప్పు లగునేని నింతకు
పూవిల్తు నరచేయి పొక్కకున్నె?
అసదుగాలియె వెట్ట యగునేని నింతకు
కమల వనం బెల్ల గ్రాగ కున్నె?
భామ! యేటికి చిగురుకై వాడఁబాఱ
వనిత! యేటికి తేనెకై వడియఁబాఱ
వెలది! యేటికి ననలకై వెల్లఁ బాఱ
పొలతి! యేటికి సురటిగాడ్పులకుఁ బాఱ

– ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.

వనజసమాన నేత్రక, కృపాజలధీశ, సురస్తవ, క్షమా
హనన దురాసదార్థి ప్రణతాసమరోన్నత సాదరాశయా,
ముని మహనీయ లాలస విభూత్యభిసేవన ధూర్తభంజనా
జనకజ శస్త మానస ప్రసన్న దయామయ సత్యవర్తనా

ఈ పద్యం శ్రీ కొడవలూరి రామచంద్రరాజు రచించిన మహా సేనోదయం అనే కావ్యం లోనిది. కుమార స్వామి జననానికి సంబంధించిన కథ ఇది. పాద గోపనం లో వ్రాయబడిన ఈ పద్యంలో మొదటి మూడు పాదాలలోని ప్రతీ మూడవ అక్షరంకలిపి చదివితే నాలుగవ పాదం ఏర్పడుతుంది. గొప్ప ప్రౌఢకావ్యంగా పేరొందిన ఈ కావ్యం దాదాపు నూటా ఇరవై సంవత్సరాల క్రితం వ్రాయబడింది.

పద్మాలవంటి నేత్రాలు కలవాడా! దయాసముద్రుడా! దేవతలచే నిత్యం స్తుతించబడేవాడా! ఓర్పుతో శత్రువులను హరించేవాడా (క్షమాహనన), చేరుకోవడానికి అలభ్యమైనా, పొందలేనిదైనా (దురాసద) శరణుకోరిన వారికి (అర్థి ప్రణత) సులభంగా లభించే వాడా! యుద్ధరంగంలో ఉన్నత ప్రతాపం అనే (సమరోన్నత) ఆదరణపూర్వక ఆశయం కలవాడా (సాదరాశయ) మునులచే ఇష్టపడేవాడా, విభూతి లాంటి అష్టైశ్వర్యాలచే సేవించబడేవాడా, దుష్టశిక్షకా, సీతాదేవి శ్రేష్ఠమైన మనసులో నివసించేవాడా (జనకజశస్తమానస) శ్రీరామా! ప్రసన్నమై దయను చూపించే సత్యవర్తనా అంటూ కవి శ్రీరామచంద్రుని ప్రార్థించాడు.

– 'శతావధాని' చేపూరి శ్రీరామ్



శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు,
పరమహంస పరివ్రాజకులు అనంతశ్రీవిభూషిత జగద్గురు
**శ్రీమదభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామివారి**
దివ్యాశీస్సులతో....చాతుర్మాస్యదీక్ష సందర్భాన ..స్వామివారి సమక్షంలో



అవధాన కళా కౌముది.. యువ విద్వన్మూర్తి

# శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలిశతావధానం

శ్రీకోలాచల మల్లినాథసూరి వేదిక

శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ సప్తమి 18-09-2026, శుక్రవారము ఉ.8గంటలకు
బ్రహ్మశ్రీ కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందంచే నామసంకీర్తన

ఉ.9గంటలకు **శతావధాన ప్రారంభసభ**

**ముఖ్యఅతిథి**
బృహత్ ద్విసహస్రావధాని, పద్మశ్రీ పురస్కృతులు బ్రహ్మశ్రీ డా.మాడుగుల నాగఫణిశర్మగారు
**సభాధ్యక్షులు :** మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకరశర్మగారు, శతావధాని

**విశిష్ట అతిథులు**
శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు, అధ్యక్షులు,తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్
**శతావధాన సంచాలకులు:** శతావధాన విద్వన్మరాళ శ్రీ ఆముదాల మురళిగారు
శతావధాన పంచానన డా.శ్రీ జి.ఎం. రామశర్మగారు
శతావధాన శరచ్చంద్ర డా.శ్రీ తాతా సందీప్‌శర్మగారు
శ్రీమరుమాముల దత్తాత్రేయశర్మ గారు , అవధాన విద్యావికాస పరిషత్ వ్యవస్థాపకులు

**ఆత్మీయ అతిథులు**
డా.శ్రీ మేడూరి సూర్యనారాయణ శర్మ గారు (పుష్పగిరి ఆస్థాన పండితులు)
అష్టావధాని డా. శ్రీ ముదిగొండ అమరనాథశర్మ గారు (పుష్పగిరి ఆస్థాన కవి)
అష్టావధాని శ్రీ ముత్యంపేట గౌరీశంకరశర్మగారు (పుష్పగిరి ఆస్థాన కవి)

**ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు శతావధానం మొదటి అంకం**
(25 సమస్యాంశాలు,25 దత్తపది అంశాలు)
అధ్యక్షులు : కుదురాటగండ,శతావధాని డా.పాలపర్తి శ్యామలానందప్రసాద్‌గారు

**మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు రెండవ అంకం**
(25 వర్ణనలు, ఆశువు అంశాలు)
అధ్యక్షులు : మహామహోపాధ్యాయ ప్రాచార్య డా.శ్రీ శలాక రఘునాథశర్మగారు

**రాత్రి 7 గంటల నుండి 8-00 గంటల వరకు**
డా.చింతలపాటి శూలపాణిగారిచే పోతనభాగవతంలో ముఖ్యఘట్టాల ప్రదర్శన



శ్రీ జగద్గురు శంకరాచార్య పుష్పగిరి మహాసంస్థానం పీఠాధీశ్వరులు,
పరమహంస పరివ్రాజకులు అనంతశ్రీవిభూషిత జగద్గురు
శ్రీమదభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామివారి
దివ్యాశీస్సులతో....చాతుర్మాస్యదీక్ష సందర్భాన ..స్వామివారి సమక్షంలో



అవధాన కళా కౌముది.. యువ విద్వన్మూర్తి
శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల సాహిత్ తొలిశతావధానం
శ్రీకోలాచల మల్లినాథసూరి వేదిక
శ్రీ పరాభవ భాద్రపద శుద్ధ సప్తమి 18-09-2026, శుక్రవారము ఉ.8గంటలకు
బ్రహ్మశ్రీ కొడకండ్ల రాధాకృష్ణశర్మ బృందంచే నామసంకీర్తన
ఉ.9గంటలకు శతావధాన ప్రారంభసభ
ముఖ్యఅతిథి
బృహత్ ద్విసహస్రావధాని, పద్మశ్రీ పురస్కృతులు బ్రహ్మశ్రీ డా.మాడుగుల నాగఫణిశర్మగారు
సభాధ్యక్షులు : మహామహోపాధ్యాయ బ్రహ్మశ్రీ దోర్బల ప్రభాకరశర్మగారు, శతావధాని
విశిష్ట అతిథులు
శ్రీ బసవరాజు శ్రీనివాస్ గారు, అధ్యక్షులు,తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్
శతావధాన సంచాలకులు: శతావధాన విద్వన్మరాళ శ్రీ ఆముదాల మురళిగారు
శతావధాన పంచానన డా.శ్రీ జి.ఎం. రామశర్మగారు
శతావధాన శరచ్చంద్ర డా.శ్రీ తాతా సందీప్‌శర్మగారు
శ్రీమరుమాముల దత్తాత్రేయశర్మ గారు , అవధాన విద్యావికాస పరిషత్ వ్యవస్థాపకులు
ఆత్మీయ అతిథులు
డా.శ్రీ మేడూరి సూర్యనారాయణ శర్మ గారు (పుష్పగిరి ఆస్థాన పండితులు)
అష్టావధాని డా. శ్రీ ముదిగొండ అమరనాథశర్మ గారు (పుష్పగిరి ఆస్థాన కవి)
అష్టావధాని శ్రీ ముత్యంపేట గౌరీశంకరశర్మగారు (పుష్పగిరి ఆస్థాన కవి)
ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు శతావధానం మొదటి అంకం
(25 సమస్యాంశాలు,25 దత్తపది అంశాలు)
అధ్యక్షులు : కుదురాటగండ,శతావధాని డా.పాలపర్తి శ్యామలానందప్రసాద్‌గారు
మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు రెండవ అంకం
(25 వర్ణనలు, ఆశువు అంశాలు)
అధ్యక్షులు : మహామహోపాధ్యాయ ప్రాచార్య డా.శ్రీ శలాక రఘునాథశర్మగారు
రాత్రి 7 గంటల నుండి 8-00 గంటల వరకు
డా.చింతలపాటి శూలపాణిగారిచే పోతనభాగవతంలో ముఖ్యఘట్టాల ప్రదర్శన

అవధాన విద్యా విజయతే తరామ్

**Avadhana Puskarini**
13 SEPTEMBER 2026





**Published by**

Avadhana Vidya Vikasa Parishat

R.No. 691/2026

Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1

West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056

Ph: 9441039146